www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -342 గురువారం19 మార్చి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

పాఠకులకు
ప్రకటనకర్తలు
శ్రేయోభిలాషులకు

## ఉగాది శుభాకాంక్షలు




నేడు ఉగాది పర్వదినం సందర్భంగా
పత్రికా కార్యాలయానికి సెలవు.
కావున రేపు
(శుక్రవారం 20-3-2026)
సంచిక వెలువడదు ..
(పునర్దర్శనం శనివారం )

# విజన్‌తో ముందుకెళ్తాం

**: శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి**



- ప్రతిపక్ష నేతగా సభకు రండి కేసీఆర్
- ఒక్కోమెట్టు ఎక్కుతూ సీఎం అయ్యా
- 2029లోనూ మాదే అధికారం
- నాలుగు కోట్ల ప్రజల ప్రయోజనమే మా ధ్యేయం
- గవర్నర్ ప్రసంగంపై ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరం
- పంటమార్పిడిపై అన్నదాతలను చైతన్యపరుస్తాం
- ఆర్గానిక్ ఫుడ్, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం
- శుక్రవారానికి శాసనసభ వాయిదా

**హైదరాబాద్ మార్చి 18ప్రజావినికిడి**

ఎవరు కలిసొచ్చినా.. కలిసిరాకపోయినా 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నొక్కి చెప్పారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించి దానికనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ సభకు వచ్చి ప్రభుత్వానికి విలువైన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. విజన్‌తో కూడిన గవర్నర్ ప్రసంగానికి ప్రతిపక్షం ధన్యవాదాలు తెలపకపోవడం బాధాకరమన్నారు. పెద్దాయన పార్టీ బాధ్యతలు అప్పగించిపోతే వాళ్లిద్దరూ(కేటీఆర్, హరీశ్‌రావు) చింపిన ఇస్తరాకు మాదిరిగా మారుస్తున్నారని విమర్శించారు. తాను క్షేత్రస్థాయి నుంచి ఒక్కో మెట్టు ఎక్కుకుంటూ రాజకీయనేతగా ఎదిగి సీఎం అయ్యాననీ, 2029లోనూ తమదే అధికారమని స్పష్టం చేశారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు అనుసరిస్తున్న తీరుపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ రెండు పార్టీల వైఖరులను తప్పుబడుతూ సుదీర్ఘంగా ప్రసంగించారు. అనంతరం స్పీకర్ సభను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తెలంగాణ ప్రజల, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చారిత్రాత్మకమని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. గత చరిత్రను అనుభవాలుగా మార్చుకుంటూ భవిష్యత్ ప్రణాళికను దృష్టిలో పెట్టుకుని గవర్నర్ ప్రసంగం తయారు చేశారన్నారు.

మిగతా 2లో.


# యుద్ధ బీభత్సం

**ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా బంకర్ విధ్వంసక బాంబులు**



- అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి మృతి
- బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో వైమానిక దాడి
- లారిజానీ హత్యకు ప్రతీకారంగా క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడిన టెహ్రాన్
- ఇరాన్ ప్రభుత్వం బలహీనపడలేదు : అమెరికాకు ఇజ్రాయిల్ రహస్య నివేదిక

**మార్చి 18ప్రజావినికిడి**



మధ్యప్రాచ్యంలో యుద్ధ బీభత్సం కొనసాగుతోంది. ఇరాన్ భద్రతా దళాల అధినేత అలీ లారిజానీ, బసిజ్ వాలంటరీ మిలిషియా ఫోర్స్ కమాండర్ జనరల్ సొలైమనీలను హతమార్చిన ఇజ్రాయిల్, అమెరికా సేనలు బుధవారం జరిపిన తాజా దాడులలో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్‌ను చంపాయి. త్వరలోనే మరిన్ని 'అనూహ్య పరిణామాలు' చోటుచేసుకుంటాయని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి కట్జ్ హెచ్చరించారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా ఇరాన్ నేతలను, సైనికాధికారులను మట్టుపెట్టే అధికారాన్ని రక్షణ దళాలకు కట్టబెట్టామని ఆయన తెలిపారు.

మిగతా 2లో.

# రాజకీయాల్లో ఫుల్‌స్టాప్‌లు ఉండవు

**: ప్రధాని మోడీ**



**ప్రజా ప్రాముఖ్య సమస్యలపై చర్చ అవసరం అందుకనుగుణంగా సమావేశాల రోజుల సంఖ్యను పెంచాలి : రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే**

న్యూఢిల్లీ **మార్చి 18ప్రజావినికిడి**

ప్రజా ప్రాముఖ్యత ఉన్న సమస్యలపై లోతుగా చర్చించేందుకు చర్చలు అవసరమనీ, అందుకు వీలుగా సభా సమావేశాల సంఖ్యను పెంచాలని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అన్నారు. బుధవారం రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న 59 మంది ఎంపీలకు వీడ్కోలు పలికే ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. "పేదలు, సమాజంలోని

మిగతా 2లో.

# ఎగిసిపడిన అగ్నికీలలు..

**ఢిల్లీ, ఇండోర్‌ల్లో 17 మంది మృతి-, ఆరుగురికి గాయాలు**

**అహ్మదాబాద్, చండీగడ్‌ల్లోనూ భారీ అగ్ని ప్రమాదాలు**

**న్యూఢిల్లీ :మార్చి 18ప్రజావినికిడి**




ని ఢిల్లీతో పాటు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదాల్లో 17 మంది మృతి చెందారు. మృతుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఢిల్లీలోని పాలం ప్రాంతంలో బుధవారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులతో సహా ఒకే కుటుంబానికి చెందిన తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోయారు. పాలం మెట్రో స్టేషన్ సమీపంలోని

మిగతా 2లో.

# అకాల వర్షాలకు నలుగురు మృతి

**పిడుగుపాటుకు ముగ్గురు, గోడకూలి ఒకరు**

**గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పంటలకు అపార నష్టం**



**అమరావతి,మార్చి 18ప్రజావినికిడి**

రాష్ట్రంలోని పలు జిల్లాలో బుధవారం ఆకస్మికంగా అకాల వర్షాలు కురిశారు. వాతావరణంలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. కొన్నిచోట్ల వర్షంతోపాటు పిడుగులు పడడంతో ముగ్గురు మృతి చెందారు. గోడ కూలి ఒక బాలుడు మరణించాడు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిలింది. రాజధాని అమరావతిలోనూ,

మిగతా 2లో.



# పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది..

- గత పాలకలు తీరుతో ప్రాజెక్టులో జాప్యం
- నిర్వాసితులతో సిఎం చంద్రబాబు సమావేశం
- నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కు అందచేత

**అమరావతిమార్చి 18ప్రజావినికిడి**

పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని అనుకున సమయానికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. గత ప్రభుత్వం వల్ల ఆలస్యం జరిగిందని అన్నారు. సకాలంలో పూర్తి చేసి గోదావరి జలాలను అందుబాటులోకి తెస్తామని అన్నారు

మిగతా 2లో.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

- డిపిఆర్ లేదు..ప్రణాళిక లేకుండా ఎలా
- మూసీ ప్రక్షాళనపై స్పష్టత లేని ప్రభుత్వం
- పేదల ఇళ్లు కూల్చివేత దారుణం
- బఫర్ జోన్ నిర్ణయంలోనూ అస్పష్టత
- అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై నిలదీసిన కెటిఆర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా బిఆర్ఎస్ వాకౌట్



**హైదరాబాద్,మార్చి 18ప్రజావినికిడి** :మూసీ నది ప్రక్షాళనకు తమకు ఎలాంటి వ్యతిరేకత లేదని, అయితే ప్రభుత్వం మూసీ ప్రాజెక్ట్ పేరుతో లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నందున దాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వ వైఖరికి

మిగతా 2లో.

# యుద్ధ బీభత్సం

**మొదటిపేజీ తరువాయి**

గుడారంలో దాక్కున్న సొలైమనీని వైమానిక దాడిలో హతమార్చామని ఇజ్రాయిల్ సైనిక ఇంటెలిజెన్స్ అధికారి ఒకరు చెప్పారు. మరోవైపు హార్ముజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ క్షిపణి స్థావరాలపై అమెరికా 2,200 కిలోల బంకర్ విధ్వంసక బాంబులను ప్రయోగించింది. జలసంధిలో ఉన్న నౌకలను ధ్వంసం చేసేందుకు ఇరాన్ క్రూయిజ్ క్షిపణులను మోహరించిందని, వాటిని లక్ష్యంగా చేసుకొని ఈ దాడులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. హార్ముజ్ జలసంధిలో ప్రయాణించే చమురు ట్యాంకర్లకు రక్షణగా నౌకలను పంపాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన అభ్యర్థనను అనేక మిత్ర దేశాలు తోసిపుచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఈ దాడి జరగడం గమనార్హం. ఇరాన్ దక్షిణ తీరంలోని బుషెర్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో కూడా దాడి జరిగింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి రేడియేషన్ వెలువడలేదని, అలాగే నష్టం కూడా జరగలేదని రష్యా, ఇరాన్ అధికారులను ఉటంకిస్తూ అసోసియేటెడ్ ప్రెస్ తెలియజేసింది. అణు విద్యుత్ ప్లాంటులో ఉన్న మెట్రోలజీ సర్వీస్ భవనం సమీపంలో ఈ దాడి జరిగింది. ఈ దాడిపై తమకు ఇరాన్ సమాచారం ఇచ్చిందని ఐరాసకు చెందిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) చెప్పింది. పర్షియన్ గల్ఫ్ వెంబడి టెహ్రాన్‌కు దక్షిణంగా 750 కిలోమీటర్ల దూరంలో ఈ అణు శక్తి కేంద్రం ఉంది. ఇది ఇరాన్ నడుపుతున్న ఏకైక అణు శక్తి ప్లాంట్. రష్యా సాంకేతిక నిపుణుల సాయంతో దీనిని నిర్వహిస్తున్నారు. కాగా ఇరాన్‌లోని దొరుద్ నగరంపై జరిగిన తాజా దాడిలో ఏడుగురు చనిపోగా 56 మంది గాయపడ్డారు.

**చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతోడ**

యుద్ధంలో నేతలు, సైనికాధికారులను కోల్పోతున్నప్పటికీ ఇరాన్ చెక్కుచెదరని ఆత్మ విశ్వాసంతో పోరు సాగిస్తోంది. లారిజానీ హత్యకు ప్రతీకారంగా అనేక గల్ఫ్ దేశాలపై వివిధ రకాల వార్‌హెడ్లతో కూడిన క్షిపణులను, డ్రోన్లను ప్రయోగిస్తోంది. వాటిని అడ్డుకునేందుకు గల్ఫ్ దేశాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇజ్రాయిల్ గగనతల రక్షణ వ్యవస్థల కన్నుగప్పి భారీ నష్టాన్ని కలిగించే ఓ ఆయుధాన్ని ఇరాన్ ప్రయోగించినట్టు సమాచారం. ఇరాన్ ప్రయోగించిన ఖొర్రంషెహర్-4, ఖ్వాద్ క్షిపణుల కారణంగా ఖతార్, కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిలలో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి.

ఇరాన్ దాడులలో యూఏఈ బాగా దెబ్బతింటోందని, క్షిపణులు, డ్రోన్లు సహా ఇప్పటి వరకూ గల్ఫ్ దేశాలపై మూడు వేలకు పైగా దాడులు జరిగాయని అల్ జజీరా వార్తా సంస్థ ప్రతినిధి బస్రావీ తెలిపారు. వీటిలో సగం దాడులు యూఏఈని లక్ష్యంగా చేసుకొని జరిగినవే. దాడుల కారణంగా దుబాయిలోనే కాక గల్ఫ్ దేశాలలోని అనేక నగరాలలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. గల్ఫ్‌లో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని, ఆయా



దేశాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలుస్తోంది. బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రాంగణాన్ని ఓ క్షిపణి తాకింది. అయితే ఈ దాడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. సౌదీ అరేబియాలో అమెరికా దళాలు, యుద్ధ విమానాలకు ఆశ్రయం కల్పిస్తున్న ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై బాలిస్టిక్ క్షిపణి దాడి జరిగింది. యూఏఈలోని ఆస్ట్రేలియా సైనిక స్థావరంపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనలో స్వల్పంగా మంటలు చెలరేగాయి.

**కువైట్ రాకుమారుడితో మాట్లాడిన మోడీ**

మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోడీ కువైట్ రాకుమారుడు సబహ్ అల్-ఖలీద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సహబ్‌తో బుధవారం టెలిఫోన్‌లో సంభాషించారు. ఈ సందర్భంగా ఆయనకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై ఆందోళన వ్యక్తం చేశారు. కువైట్ సార్వ భౌమత్వంపై జరుగుతున్న దాడులను ఖండించారు. హార్ముజ్ జలసంధి మీదుగా చమురు నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించేలా చూసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

# విజన్‌తో ముందుకెళ్తాం

**మొదటిపేజీ తరువాయి**

గత బీఆర్ఎస్ ప్రభుత్వం 11.5 శాతం వడ్డీకి అప్పు తెస్తే కేంద్రం చుట్టూ తిరిగి దాన్ని 7.5 శాతం తగ్గించుకున్నామనీ, పార్టీ పరంగా సైద్ధాంతికంగా విభేదాలున్నప్పటికీ ఈ విషయంలో సహకరించిన నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ ఇచ్చిన మూడు నెలల్లో పరీక్షలు ఎందుకు నిర్వహించలేదని విమర్శించారు. నోటిఫికేషన్లు వేయడం, కోర్టులకు ఎక్కేలా చేయడం, నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేయడం ఆనాడు షరామామూలుగా జరిగిందన్నారు. అదే బంధువు, కుటుంబ సభ్యురాలు ఎంపీగా ఓడిపోతే మూడు నెలల్లో వారికి పోస్టులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. తమ పాలనలో 80వేలకు పైగా ఉద్యోగాలను భర్తీచేశామని నొక్కి చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం విషయంలో ప్రతిపక్షం కలిసి వస్తుందని భావించినాడవారి అహంకార ధోరణి ఇంకా పోలేదని విమర్శించారు. ఆరోపణలు, ప్రత్యారోపణలతో సభను తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.

అధికారం పోయినా ఇంకా తామే రాజులమనే భావనతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారనీ, రాచరికంలో వారసత్వానికి అవకాశం ఉందిగానీ ప్రజాస్వామ్యంలో దానికి ఆస్కారం లేదని స్పష్టం చేశారు. తెలంగాణతల్లి ఆవిష్కరణకు ప్రధాన ప్రతిపక్ష నేత వస్తారని ఆశిస్తే నిరాశే మిగిలిందన్నారు. ప్రజలు బుద్ధి చెప్పి ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా అదే అహంకార పూరిత ధోరణి వ్యవహరిస్తున్నారని తెలిపారు. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటిదాకా జీతం రూపంలో కోటీ ఆరు లక్షల రూపాయలు తీసుకున్న వ్యక్తి సభకు గైర్హాజరు కాకపోవడం సరిగాదనీ, విధులకు హాజరుకాకుండా ఉన్నవారిపై చర్చ జరగాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ముందు చూపుతో స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రణాళికలతో ముందుకెళ్లడం, ఆ తర్వాత ఇందిరాగాంధీ, రాహుల్‌గాంధీ, పీవీ నర్సింహారావు, మన్మోహన్‌సింగ్ తీసుకున్న కీలక నిర్ణయాలు, సంస్కరణలు ప్రపంచం ముందు భారత్‌ను ఒక శక్తివంతమైన దేశంగా నిలబెట్టాయన్నారు. పేదలకు ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇచ్చిన, సీలింగ్, అసైన్డ్ భూములు పంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనన్నారు. వారి వ్యూహాత్మక ఎత్తుగడలతోనే నేడు ప్రపంచంలోని దిగ్గజ కంపెనీలకు మన దేశం వారు సీఈఓలుగా ఉన్నారని గుర్తుచేశారు. సిలికాన్ వ్యాలీలో మన తెలుగువాళ్లు రాణించడానికి కారణం రాహుల్‌గాంధీ, పీవీ, మన్మోహన్‌సింగ్ తీసుకున్న సంస్కరణలే కారణమని వివరించారు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి హైదరాబాద్‌లో హైటెక్ సిటీకి శంకుస్థాపన చేస్తే చంద్రబాబు ముందుకు తీసుకెళ్లారని తెలిపారు.తాము మూసీ సుందరీకరణ చేస్తామంటే ప్రతిపక్షం అడ్డుపడుతామని చెప్పటాన్ని సీఎం తప్పుబట్టారు. ఆక్రమణలు తొలగించడం, పరిశ్రమలు తరలించడం, చెరువులు, నాలాలను పరిరక్షించడం లాంటి మంచి చేయొద్దా? అని నిలదీశారు. కాలుష్యంతో రాజధాని ఢిల్లీ, వర్షాల ఎఫెక్ట్‌తో ఫైనాన్సియల్ రాజధాని ముంబై, ట్రాఫిక్ సమస్యతో బెంగుళూరు నగరాలు కూరుకుపోవడంతో ఐటీ, తదితర రంగాల పరిశ్రమలు తెలంగాణ వైపు చూస్తున్నాయని వివరించారు. ద

నల్లచెరువును హైడ్రా రక్షిస్తే ప్రజలు బ్రహ్మరథం పట్టారనీ, ఉమర్‌ఉద్దౌల్లా చెరువు పునరుద్ధరిస్తే ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని చెప్పారు. తుమ్మిడి కుంటను ప్రముఖ సినీస్టార్ అక్రమించుకుంటే ఆక్రమణలు తొలగించి చెరువును కాపాడామనీ, రియల్టర్ల కబ్జా నుంచి సున్నం చెరువును రక్షించుకున్నామని వివరించారు. బేగంపేటలో 200 ఫీట్ల ఉన్న నాలా 30 ఫీట్లకు కుచించుకుపోయిందనీ, హైదరాబాద్ నగరాన్ని కొంత మంది దురాశపరులు ఆమ్రణలకు పాల్పడితే కాడపాడుతున్నామని నొక్కి చెప్పారు.ఇలా మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడమేంటని నిలదీశారు. హైదరాబాద్ నగరంలో నాలాలపై 28వేల అక్రమ కట్టడాలున్నాయనీ, చట్టం ఎలాంటి నోటీసులు లేకుండా కూల్చేయాలని చెబుతున్నదని కేసీఆర్ అనలేదా? ప్రశ్నించారు. డ్రోన్లతో, మ్యానువల్‌గా సర్వేలు చేయించి అక్రమ కట్టడాలను జేసీబీలతో కూల్చేస్తామని కేటీఆర్ చెప్పలేదా? అని నిలదీశారు. మూసీలో కంటే వీళ్ల కడుపులో ఎక్కువ విషం ఉందని విమర్శించారు. మీ పాలిత రాష్ట్రాల్లో సబర్మతీ, గంగా, యుమునా రివర్ ఫ్రంట్ల పేరుతో ప్రక్షాళన చేస్తున్నారు కదా? సబర్మతిలో వేల కుటుంబాలు నిర్వాసితులు అయ్యారు కదా? అందులో ఎంత మందికి పరిహారం ఇచ్చారు? దానిపై నిజనిర్ధారణ కమిటీ వేసి పంపుదామా? ఇక్కడ మూసీ ప్రక్షాళన చేసుకుంటుంటే వచ్చిన సమస్య ఏంటి? అని బీజేపీ సభ్యులను ప్రశ్నించారు.

# పోలవరం నిర్వాసితుల త్యాగం మరువలేనిది..

**.మొదటిపేజీ తరువాయి**

ఈ సందర్భంగా ముంపు గ్రామాల నిర్వాసితులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సమావేశం నిర్వహించారు. పునరావాస పరిహార ప్యాకేజీ మూడో విడతలో భాగంగా నిర్వాసితులకు రూ.226 కోట్ల చెక్కును సీఎం అందించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్రానికి జీవనాడి అని, నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. గత పాలకులు నిర్వాసితులను పట్టించుకోకుండా, వరదల్లో ప్రజలు మునిగిపోతున్నా నిర్లక్ష్యంగా వదిలేశారని సీఎం విమర్శించారు. ప్రాజెక్టు కోసం తమ ఇళ్లు, భూములను త్యాగం చేశారని సీఎం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా రూ.226.6 కోట్లను నిర్వాసితుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ప్రకటించారు. గతంలో సంక్రాంతి సందర్భంగా మొదటి విడతగా రూ.800 కోట్లు, దీపావళి సమయంలో రెండో విడతగా రూ.916 కోట్లు చెల్లించినట్లు గుర్తుచేశారు. 21 నెలల్లో 26,149 మంది నిర్వాసితులకు మొత్తం రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. మూడోసారి గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్ట్ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు అవసరమని, ఒక వంతెన కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. నిర్వాసితుల త్యాగానికి ప్రతిఫలం పోలవరం ప్రాజెక్ట్ అని సీఎం పేర్కొన్నారు. నిర్వాసితులకు పారదర్శకంగా చెల్లింపులు జరుపుతున్నామని చెప్పారు. దళారులను నమ్మవద్దని సూచించారు. ప్రాజెక్ట్ ప్రారంభానికంటే ముందే నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. పోలవరం నిర్వాసితుల పట్ల కూటమి ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందని.. నిర్వాసిత యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కూడా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రాజెక్ట్ రెండు దశలుగా నిర్మాణం జరుగుతోందన్నారు సీఎం. తొలి దశలో 38,068 మంది నిర్వాసితులు ఉన్నారని తెలిపారు. ప్రతి నిర్వాసితుడికి ఇంటి నిర్మాణానికి రూ.3.5 లక్షలు ఇస్తున్నామని, ఇంటి జాగా కోసం రూ.2 లక్షలకు పెంచినట్లు వివరించారు. కేంద్ర ప్రాజెక్ట్ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనులు చేపడుతోందని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిన్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రూ.440 కోట్ల వ్యయంతో కట్టిన డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందని.. ఇప్పుడు మళ్లీ రూ.వెయ్యి కోట్లతో నిర్మాణం చేపట్టామన్నారు. 6 -7 ఏళ్ల పాటు ప్రాజెక్ట్ ఆలస్యమై పోయిందని.. ప్రాజెక్టు ఏమైనా పర్వాలేదనే అహంకార ధోరణితో గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. వారం రోజుల్లో డయాఫ్రం వాల్ పూర్తవుతుందని, ప్రాజెక్ట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# రాజకీయాల్లో పుల్‌స్టాప్‌లు ఉండవు

**మొదటిపేజీ తరువాయి**

అణగారిన వర్గాలు, రైతులు, కార్మికుల ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలపై చర్చించడానికి మరింత అవకాశం ఉండాలి. తరచుగా ఈ సమస్యలను లేవనెత్తినప్పుడు అధికార పార్టీ దానిని విమర్శగా భావించి, కనీసం వినకుండానే ఖండించడం ప్రారంభిస్తుంది. అయితే ప్రభుత్వం ప్రజల ఆందోళనలను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి" అని అన్నారు. చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యులు పాల్గొనేందుకు ఏ ఆటంకం కలిగినా అది పార్లమెంట్ వ్యవస్థను బలహీనపరుస్తుందని అన్నారు. "పార్లమెంట్ సభ్యులకు అందుబాటులో ఉన్న పరిమిత అవకాశాలలో కూడా ముఖ్యమైన అంశాలు ప్రస్తావించినప్పుడు, ఆ వ్యాఖ్యలు పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమైనవి కానప్పటికీ, వాటిని తరచుగా సభా కార్యకలాపాల నుంచి తొలగిస్తున్నారు. అని అన్నారు. "రాజ్యసభ కార్య విధాన నియమావళి, సభా కార్యకలాపాల నిర్వహణపై కాలానుగుణ సమీక్ష అత్యవసరం. ఈ అంశం ప్రస్తుతం సాధారణ ప్రయోజనాల కమిటీ (జీపీసీ) పరిశీలనలో ఉంది. దీనిపై తీవ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది. రాజకీయాల్లో పాల్గొనే వారు ప్రజా జీవితం నుంచి ఎన్నడూ విరమించుకోరు. దేశ సేవ చేయాలనే వారి తపనలో వారు ఎన్నడూ అలసిపోరు" అని పేర్కొన్నారు.

**రాజకీయాల్లో పుల్‌స్టాప్‌లు ఉండవు: ప్రధాని మోడీ**

రాజ్యసభలో పదవీ విరమణ చేస్తున్న సభ్యులనుద్దేశించి ప్రధాని మోడీ మాట్లాడుతూ, పదవీకాలం ముగిసినంత మాత్రాన ప్రజాసేవ ముగిసినట్టు కాదన్నారు. రాజ్యసభ మేధావుల వేదిక అని, ఇక్కడ లభించే జ్ఞానానికి విలువ కట్టలేమని తెలిపారు. పార్లమెంట్‌ను ఒక బహిరంగ విశ్వవిద్యాలయంగా పేర్కొంటూ పదవీ విరమణ చేసిన ఎంపీలు తమ జీవితాల్లో చురుకుగా ఉండాలని కోరారు. హెచ్‌డీ దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్ వంటి దిగ్గజ నేతల సహకారాన్ని మరువలేమని, సగానికి పైగా తమ జీవితాన్ని పార్లమెంటుకే అంకితం చేశారని ప్రశంసించారు. కొత్తగా ఎన్నికైన ఎంపీలు వారి నుంచి నేర్చుకోవాల్సినది ఎంతైనా ఉంటుందని సూచించారు.

**మాతో ప్రేమడమోడీతో పెండ్లి**

**మాజీ ప్రధాని దేవెగౌడను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యలు**

రాజ్యసభలో పదవీకాలం ముగిసిన సభ్యుల వీడ్కోలు సభలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కాసేపు నవ్వులు పూయించారు. మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను ఉద్దేశించి మాట్లాడుతూ, గత 54 ఏండ్లుగా ఆయన తనకు తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని చెప్పారు. 'అయితే ఏమి జరిగిందో తెలియదు కానీ, ఆయన మాతో ప్రేమ సాగించి మోడీని పెండ్లి చేసుకున్నారు' అంటూ చమత్కరించారు. దీంతో సభలో ఉన్న ప్రధాని మోడీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు.దేశానికి సేవ చేయాలనే తపన కలిగిన వారు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని ఖర్గే అన్నారు. కాగా, రాజ్యసభ సభ్యుల వీడ్కోలు సెషన్‌లో శరద్ పవార్, డీఎంకే నేత తిరుచ్చి శివతో తన అనుబంధాన్ని కూడా ఖర్గే గుర్తుచేసుకున్నారు. అయితే పవార్, తిరుచ్చి శివ తిరిగి రాజ్యసభకు రాబోతున్నారు. ఖర్గే తన ప్రసంగంలో కేంద్ర మంత్రి, ఆర్‌పీఐ(ఏ) చీఫ్ రామ్‌దాస్ అథవాలేపై కూడా చలోక్తులు విసిరారు. 'ఆయన ఎప్పుడూ తన కవితల్లో మోడీని పొగుడుతుంటారు. ఆయనకు మరే ఇతర కవితలు తెలియవేమో' అని చెప్పారు.

# ఎగిసిపడిన అగ్నికీలలు..



రామ్‌చౌక్ మార్కెట్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఉదయం 7 గంటల సమయంలో మంటలు చెలరేగి, వేగంగా వ్యాప్తి చెందాయి. ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే సహాయక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులతో పాటు బిఎస్ఇఎస్, వైమానిక దళం, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందితో సహయక చర్యల్లో పాల్గొన్నారు. వీరితో పాటు 30 అగ్నిమాపక వాహనాలు, 11 అంబులెన్సులను రంగంలోకి దించారు. మంటలు తీవ్రంగానూ, వేగంగా వ్యాపించడంతో రక్షణ చర్యలు క్లిష్టంగా మారాయి. పైగా అది రద్దీ ప్రాంతం కావడంతో సిబ్బందికి మంటలను అదుపులోకి తీసుకుని రావడం కష్టంగా మారింది. దాదాపు నాలుగు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటల భయంతో ఇద్దరు భవనంపై అంతస్తు నుంచి దూకగా, వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. స్థానికుల కథనం ప్రకారం ముందుగా మొదటి అంతస్తులో ప్రారంభమైన మంటలు తరువాత వేగంగా భవనం మొత్తం వ్యాప్తించాయి. మొదటి అంతస్తులో రాజేందర్ కశ్యప్ అనే వ్యక్తికి చెందిన వస్త్ర, సౌందర్య సాధనాల షోరూం ఉంది. రాజేందర్ కుటుంబం రెండు, మూడు అంతస్తుల్లో నివసిస్తుంది. మొదటి అంతస్తులో అత్యంత వేగంగా మండే స్వభావం కలిగిన పరిమళ ద్రవ్యాలు, ఇతర సౌందర్య ఉత్పత్తులు ఉండటం వల్ల అక్కడ మంటలు చెలరేగి, వేగంగా వ్యాప్తి చెందాయని స్థానికులు తెలిపారు. అయితే, ఈ అగ్నిప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో రాజేందర్ కుటుంబానికి చెందిన తొమ్మిది మంది మృతి చెందారు. ఈ అగ్నిప్రమాదంలో రాజేందర్ భార్య లాడో (70), వారి కుమారులు ప్రవేశ్ (33), కమల్ (39), కమల్ భార్య ఆషు (35)తో పాటు వీరికి చెందిన 15, 6, మూడేళ్ల వయస్సు ఉన్న ముగ్గురు కుమార్తెలు మరణించారు. అదేవిధంగా రాజేందర్, లాడోల కుమార్తె హిమాన్షి (22), కోడలు దీపిక (28) కూడా ఈ అగ్నిప్రమాదంలో మరణించారు. రాజేందర్ మూడవ కుమారుడైన 32 ఏళ్ల అనిల్, తన రెండేళ్ల కుమార్తెను భవనం నుంచి దించే ప్రయత్నంలో మూడో అంతస్తు నుంచి ఆమెను కింద పడేశాడు. తరువాత. అతను కూడా దూకేశాడు. ఇద్దరికీ గాయాలయ్యాయని, చికిత్స పొందుతున్నారని అధికారులు తెలిపారు. రాజేందర్ నాల్గో కుమారుడు 29 ఏళ్ల సచిన్‌కు 25 శాతం గాయాలయ్యాయి. సప్దర్‌జంగ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, రాజేందర్ గోవా వెళ్లగా, కుమారుల్లో మరొకరు కుటుంబంతో సహా విహారయాత్రకు వెళ్ళారు.

# అకాల వర్షాలకు నలుగురు మృతి

**మొదటిపేజీ తరువాయి**

తాడేపల్లిలోనూ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. రాజధాని పనుల్లో భాగంగా బిఎస్ఆర్ కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్న రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాసరావు వర్షం వస్తుండడంతో తుళ్లూరు మేరిమాత స్కూలు మైదానంలో వేచి ఉండగా సమీపంలో పిడుగుపడడంతో షాక్‌కు గురయ్యారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. గుంటూరు జిల్లాలో పలుచోట్ల అరటి తోటలు నేల వాలాయి. మిర్చి, అపరాల పంటలకు నష్టం వాటిల్లింది. గుంటూరు మిర్చి యార్డులో విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి పాక్షికంగా తడిసింది. పల్నాడు జిల్లాలో కల్లాల్లో ఆరబోసిన మిర్చి తడిసిపోయింది. నూజెండ్ల మండలం నాగిరెడ్డిపాలెంలోని పొలంలో మిరపకాయలు కోస్తుండగా పిడుగుపడడంతో ప్రకాశం జిల్లాకు చెందిన వలస కార్మికులు కంటూరి సుబ్బరత్నమ్మ (55) మరణించారు. బాపట్ల జిల్లా నగరం మండలం ధూళిపూడి గ్రామానికి చెందిన పెరవలి వనజ (35) పిడుగుపాటుకు మృతి చెందారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం పడమరప్రాతకోట గ్రామంలో భారీ వర్షానికి గోడకూలి ఏడాది బాలుడు మరణించాడు. ఆత్మకూరు, మంత్రాలయంలో వడగండ్ల వాన పడింది. కర్నూలు నగరంలో తేలికపాటి వర్షం కురిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా జికె.వీధి మండలం ధారకొండలో గంటసేపు కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారిపై వర్షపు నీరు పొంగి ప్రవహించింది. ధారాలమ్మ అమ్మవారి సందర్శనకు వచ్చిన యాత్రికులు ఇబ్బందులకు గురయ్యారు. సీలేరులో భారీ వర్షం పడింది. జి.మాడుగుల, అరకులోయ మండలాల్లో కొన్నిచోట్ల మోస్తరు వర్షం పడగా, మరికొన్ని చోట్ల చిరుజల్లులు కురిశాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పలుచోట్ల తేలికపాటి వర్షాలు పడ్డాయి. అనంతపురం, గుంతకల్లు, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. భారీ వర్షానికి ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని పలు లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. భవానీపురం, పాత హెచ్‌బి కాలనీ, రోటరీనగర్, కబేళా, రామరాజ్యనగర్, ఇస్లాంపేట, వించిపేట, నైజాంగేట్, కెఎల్‌రావు నగర్‌లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ద్విచక్ర వాహనదారులు, చిరు వ్యాపారులు అవస్థలు పడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏలూరు నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్లన్నీ బురదమయంగా మారడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల తేలికపాటి జల్లులు పడ్డాయి.

# మూసీ ప్రక్షాళన పేరుతో లక్షన్నరకోట్ల దోపిడీ

**మొదటిపేజీ తరువాయి**

నిరసనగా బుధవారం అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ మేరకు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. అసెంబ్లీలో మూసీ ప్రక్షాళనపై బీఆర్ఎస్ సభ్యులు అడిగిన ప్రశ్నకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన దాటవేసే ధోరణిలో సమాధానం ఇవ్వడంపై కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర పైసలు లేవు.. ప్రణాళికలు లేవని విమర్శించారు. మూసీ ప్రక్షాళనకు మేం వ్యతిరేకం కాదు.. లక్షన్నర కోట్ల దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు. మూసీ ప్రక్షాళనపై అసెంబ్లీలో బుధవారం జరిగిన చర్చ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ పలు ప్రశ్నలు సంధించారు. మూసీ ప్రాజెక్టు కోసం రుణం మంజూరైందని గతంతో మంత్రి చెప్పారని తెలిపారు. డీపీఆర్ కూడా సబ్‌మిట్ చేయలేదని అప్పుడు ఏడీబీ చెప్పిందని పేర్కొన్నారు. రుణం మంజూరు కాలేదని ఈ నెల 11వ తేదీన ఏడీబీ లేఖ ఇచ్చిందన్నారు. డీపీఆర్ తయారీకి 18 నెలలు పడుతుందని గతంతో ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. 18 నెలలు పడుతుందన్న డీపీఆర్ రెండు నెలల్లో ఎలా వచ్చిందని ప్రశ్నించారు.మూసీ ప్రాజెక్టు మొదటి ఫేజ్ తర్వాత ఎన్ని ఫేజులు ఉంటాయని కేటీఆర్ అడిగారు. మూసీ ప్రాజెక్టుకు ఎన్ని ఫేజులు ఉన్నాయని ప్రశ్నించారు. రూ.16వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టు లక్షన్నర కోట్లు ఎందుకు అని నిలదీశారు. మూసీ ప్రాజెక్టులో బఫర్ జోన్ ఎంత అని ప్రశ్నించారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుతో వేలాది మంది నష్టపోతున్నారని తెలిపారు. మూసీ ప్రాజెక్టుతో రేవంత్ సర్కార్ గృహ మేధ యాగం చేస్తోందని మండిపడ్డారు. బ్లాక్ లిస్ట్ చేసిన కంపెనీలకు కాంట్రాక్టు ఎందుకిస్తున్నారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండా హడావిడిగా ఇళ్లు ఎందుకు కూలుస్తున్నారని అడిగారు. కేటీఆర్ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలిన ప్రభుత్వం.. దాటవేసే ధోరణిలో వ్యవహరించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. మూసీపై రేవంత్ సర్కార్ తీరుకు నిరసన తెలిపారు. ముఖ్యంగా డీపీఆర్ తయారీ, ఇళ్ల కూల్చివేతలు, భూసేకరణ, ప్రాజెక్ట్ వ్యయం పెంపు, అలాగే ప్రభుత్వం చేస్తున్న విభిన్న ప్రకటనలలో ఉన్న విరుద్ధతలను ఎత్తిచూపుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, సుధీర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, బండారు లక్ష్మారెడ్డి కలిసి మూసీ ప్రాజెక్టుపై అనేక సందేహాలను వ్యక్తం చేశారు. మొత్తం 16 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాజెక్టును లక్షన్నర కోట్లకు పెంచడం వెనుక ఉద్దేశ్యం ఏమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి ఒకవైపు లక్షన్నర కోట్లు అంటుండగా, సభలో మాత్రం నాలుగు, ఐదు వేల కోట్లు అని చెప్పడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు.

ఈ ప్రాజెక్టును ఎన్ని దశల్లో అమలు చేస్తారు, ఎంత భూసేకరణ జరుగుతుంది, ఎన్ని ఇళ్లు కూల్చివేస్తారు అనే విషయాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గెజిట్ ప్రకారం 10,000 పైగా ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని, 3,260 ఎకరాల భూమి సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. బఫర్ జోన్‌ను విస్తరించామని స్థానిక ఆర్డీవో చెబుతున్నారని, అసలు బఫర్ జోన్ ఎంత వరకు పెంచారో, దానికి ప్రమాణాలు ఏమిటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. మూసీ ప్రాజెక్ట్ పేరిట ప్రజల ఆస్తులు, ఇళ్లు, జీవనోపాధిపై దెబ్బతీసే చర్యలను బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని, పారదర్శకత లేకుండా తీసుకునే ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద డీపీఆర్ ఉందా లేదా అన్న విషయానికే స్పష్టమైన సమాధానం లేదని విమర్శించారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ సైతం డీపీఆర్ లేదని చెబుతున్నారని తెలిపారు. ఎన్ని ఇళ్లు కూల్చివేస్తున్నారు అనే విషయానికీ ప్రభుత్వం సరైన వివరాలు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం ÷వ్ స్టార్ హోటళ్లలో ప్రజెంటేషన్లు చేయకుండా, బాధితులతో ప్రజల మధ్యే ప్రజెంటేషన్ ఇవ్వాలని తాము డిమాండ్ చేసినట్లు తెలిపారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం19 మార్చి 2026

## గిరిజన ఆశ్రమ పాఠశాలలో హెల్త్ క్యాంపు



**ప్రజావినికిడి,(వాజేడు):**పేరూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో,ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక లో భాగంగా హెల్త్ క్యాంప్ (వైద్య శిబిరం )ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరం లో విద్యార్థులకు అన్ని రకాల స్క్రీనింగ్ టెస్ట్ లు, రక్త పరీక్షలు,కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ హెల్త్ క్యాంప్ లో సీనియర్ వైద్యులు రిధిమ,మనోజ్ లాల్,కిషన్,కె. ప్రహర్ష,జె.హర్ష గణేష్,వశి కృష్ణ, రవితేజ, సారంగపాణి, ప్రవీణ్ రెడ్డి ఆర్బిఎస్కే వైద్యులు, సిబ్బంది,ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు ఎస్ నాగమణి, డిప్యూటీ వార్డెన్ ఎమ్ ఈశ్వర్ రావు, నర్సింగరావు, వైద్య సహాయకురాలు ఎ.రమ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉగాది,రంజాన్ పండగల దృష్ట్యా షాద్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎసిపి లక్ష్మీనారాయణ,ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహణ



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**షాద్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఉగాది అలాగే రంజాన్ పండగల సందర్భంగా శాంతి భద్రతలను పరిరక్షించేందుకు పోలీస్ శాఖ వారు శాంతి సమావేశం.ఈ సమావేశం ఎసిపి లక్ష్మీనారాయణ, ఆధ్వర్యంలో జరిగింది.షాద్ నగర్ పట్టణం పరిసర గ్రామాలకు చెందిన వివిధ మతాల ప్రముఖులు,మత పెద్దలు,సామాజిక నాయకులు, ప్రజాప్రతినిధులు అదేవిదంగా గౌరవనీయ పౌరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.సమావేశంలో పాల్గొన్న మత పెద్దలు అలాగే పౌరులు ఉగాది అలాగే రంజాన్ పండుగలను పరస్పర గౌరవభావంతో, సోదరభావంతో,ప్రశాంతంగా జరుపుకోవాలని తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. సమాజంలో శాంతి, సామరస్యాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొన్నారు.ఎసిపి లక్ష్మీనారాయణ,మాట్లాడుతూ, పండుగల సందర్భంగా శాంతి భద్రతల కోసం అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు పూర్తిగా చేయబడతాయని హామీ ఇచ్చారు.అలాగే ఎవరైనా ఉద్దేశపూర్వకంగా శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినా లేదా ఏ మతానికి చెందిన వారి మతభావాలను దెబ్బతీసే చర్యలు చేపట్టినా,వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ శాంతి సమావేశాన్ని షాద్ నగర్ పోలీస్ స్టేషన్ సీఐ సీతారాం, నిర్వహించారు.సమావేశంలో అన్ని మతాలకు చెందిన ప్రముఖ నాయకులు,మత పెద్దలు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.పండుగల సందర్భంగా ప్రజలందరూ పరస్పర గౌరవంతో, సఖ్యతతో,ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలను జరుపుకోవాలని పోలీసు అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ద బెస్ట్ టిబి అధికారి అవార్డు 2026కు

# డాక్టర్ అడెపు రాజేశం ఎంపిక

**ప్రజావినికిడి, (హైదరాబాద్):**
గత 25 సంవత్సరాలుగా వైద్యరంగంలో క్షయ వ్యాధి నివారణకై ఎనలేని నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ రాష్ట్ర టిబి నియంత్రణ అధికారి,సివిల్ సర్జన్,స్పెషలిస్ట్, జాయింట్ డైరెక్టర్ క్షయ వ్యాధి శిక్షణ ప్రదర్శన కేంద్రం డైరెక్టర్గా సేవలందిస్తున్న డాక్టర్ అడెపు రాజేశం కు ఉన్నత టిబి అధికారి అవార్డు 2026 ను ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ నేడు ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు.ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు స్టేట్ టిబి సెంటర్ డిఎంహెచ్ఎస్ కోటి లో జరిగే సదస్సులో ఈ అవార్డును ప్రధానం చేస్తారని తెలిపారు.క్షయ రహిత రాష్ట్రం కోసం నిరంతరం కృషి చేస్తూ తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం దేశంలోనే ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రంగా నిలవడానికి డాక్టర్



రాజేశం ఎనలేని కృషి చేశారన్నారు. 1998 నుండి వైద్య వృత్తిలో నిరుపేదలకు ప్రత్యేకించి నగర మురికివాడలు, గ్రామీణ ప్రాంతాలలో క్షయ వ్యాధిగ్రస్తులపై అనేక శిబిరాలు నిర్వహించి ప్రభుత్వం నుండి అందించే ఔషధాలు,రవాణా ఖర్చులు క్షయ వ్యాధి రోగులకు అందేటట్లు చేస్తూ ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. 1986లో ఎంబిబిఎస్ పూర్తి చేసి,1998 సంవత్సరంలో వైద్య అధికారిగా కరీంనగర్ జిల్లాలో నియమితులయ్యారు.2016 నుండి 2018 వరకు కరీంనగర్ డీఎంహెచ్ఓ గా బాధ్యత నిర్వహించారు. డాక్టర్ రాజేశం కరీంనగర్ కలెక్టర్ నుండి 2011 మరియు 2017 లో సంవత్సరంలో తెలంగాణ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు.తదుపరి 2018 నుండి నేటి వరకు డైరెక్టర్ ఎస్.టి.డి.సి గా సేవలందిస్తూ ఆయన జీవితం సమాజానికి ఆరోగ్యం, అచంచలమైన సేవకు వెలుగు దీపం గా నిలుస్తుందని అన్నారు.

## రంగారెడ్డి జిల్లాలోఇండ్లు పొందిన లబ్దిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండ నివసించాలి..

**పూర్తి అయిన నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను లబ్దిదారులకు కేటాయించాలి..**

**డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు తీసుకున్న ఇంక వాటిల్లో నివసించని వారికి కేటాయించిన ఇండ్లను నోటీస్ ఇచ్చి రద్దు చేయండి..**

**గడువులోపు (మార్చి 31లోపు) లబ్దిదారుల ఎంపిక పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచన..**

**ప్రజావినికిడి ,(రంగారెడ్డి):**
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుండి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు,తహసీల్దార్లు,మిషన్ భగీరథ అధికారులు,విద్యుత్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పూర్తి అయిన,నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు లబ్దిదారులను ఎంపిక చేయాలని తెలిపారు.సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు.ఇందిరమ్మ కమిటీల సహాయంతో ఎంపిక చేసిన లిస్ట్ ను జిల్లా మంత్రి ఆమోదం తీసుకొని గజిటెడ్ ఆఫీసర్ ద్వారా ధృవీకరణ చేసి మంజూరు చేస్తారని తెలిపారు.డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు వాటిలో నివాసం ఉండని లబ్దిదారులందరు ఈ నెల 31వ తేదీ వరకు తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని,ఏమైనా ఇబ్బందులు ఉంటే వ్రాతపూర్వకంగా తెలియజేయాలని,లేని యెడల ఏప్రిల్ మొదటి వారంలో వారికి కేటాయించిన ఇండ్లను రద్దు చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు.అన్నీ హౌసింగ్ కాలనీలలో అవసరమైన మౌలిక



సదుపాయాలైన విద్యుత్ సరఫరా, త్రాగునీటి సౌకర్యం కల్పించాలని, పరిశుధ్యం పనులు చేపట్టాలని సంబంధిత విద్యుత్,హెచ్ఎం డబ్ల్యూ ఎస్ మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. ఇప్పటి వరకు వచ్చిన ఎల్2 లిస్ట్ ఇంకా మిగిలి ఉంటే దగ్గరలో ఉన్న ఎకరం కంటే ఎక్కువ ఉన్న స్థలాలను గుర్తించి మంజురి నిమిత్తం ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదే విధంగా డబల్ బెడ్ రూమ్ ల కాలనీలలో ఉన్న దుకాణాలను వేలం వేయడం జరుగుతుందని, వేలం వేయడం ద్వారా వచ్చిన మొత్తాన్ని కాలనీల అభివృద్ధి నిమిత్తం ఉపయోగించడం



జరుగుతుందని తెలిపారు.
సంబంధిత అధికారులందరూ నిర్లక్ష్య ధోరణి అవలంభించకుండా పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్,జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్,ఆర్డీఓలు అనంత్ రెడ్డి,జగదీశ్వర్ రెడ్డి,వెంకట్ రెడ్డి,సరిత,పార్థసింహ రెడ్డి,తహసీల్దార్లు,హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చని హామీలపై ఎల్బీనగర్ ఎం ఎం సి జోనల్ కమిషనర్ హయత్ నగర్ తహశీల్దార్ కు వినతి పత్రం..

### -తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి






**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**
రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు అమలు చేయకపోవడంతో బుధవారం రోజు భారతీయ జనతా పార్టీ బి.ఎన్ రెడ్డి నగర్ డివిజన్, హయత్ నగర్ డివిజన్, వనస్థలిపురం డివిజన్, మనసురాబాద్ డివిజన్ల తరపున ఎల్బీనగర్ ఎం.ఎం.సి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ హయత్ నగర్ తహశీల్దార్ శ్రీమతి కె జానకి రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హయత్ నగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి చేనేత మోర్చా రాష్ట్ర కన్వీనర్ బొమ్మ రఘురాం నేత,బిజెపి పార్టీ బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగని శ్రీనివాస్, వనస్థలిపురం డివిజన్ అధ్యక్షులు క్రాంతి గౌడ్, మనసురాబాద్ డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్ రెడ్డి తో కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం అత్యంత సిగ్గుచేటని, కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా తులం బంగారం వెంటనే అమలు చేయాలని, మహిళలకు ఇస్తానన్న 2500 రూపాయల పథకం వెంటనే అమలు చేయాలని, అదేవిధంగా వృద్ధులకు, వికలాంగులకు, దివ్యాంగులకు, వితంతువులకు నూతన పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని,యువతకు ఇచ్చిన జాబ్ క్యాలెండర్ హామీ వెంటనే అమలుపరచాలని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేని పక్షంలో ప్రజల తరపున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్,కార్యదర్శి నూతి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి,కొత్త రవీందర్ గౌడ్, భూపాల్ రెడ్డి, శంకరయ్య గౌడ్, లక్ష్మారెడ్డి, శ్రీధర్ రావు,ప్రేమ్ నాథ్, విష్ణువర్ధన్ రెడ్డి, రవిశంకర్,శరత్ కుమార్,మహేష్ గౌడ్,మహేందర్ రెడ్డి,ప్రభాకర్ యాదవ్,శ్రీనివాస్ శర్మ,రాజు, మణిపాల్ రెడ్డి, శ్రీనివాస్ రావు, గోపి,విజయ్ కుమార్,సురేష్ కుమార్,అఖిల్ గౌడ్,రఘు, సిద్దేశ్వర్, సాయిరాం తదితరులు ఉన్నారు.




ఈశ్రీ పరాభవ నామ సంవత్సరంలో మీ కుటుంబానికి ఆనందం,ఆరోగ్యం,ఐశ్వర్యం అదేవిదంగా శాంతి కలగాలని కోరుకుంటున్నాను.ఈ కొత్త సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను.



మీ.ఆలేటి రంగేశ్వరి నాయుడు.
ఎల్బీనగర్ నియోజకవర్గ భారస పార్టీ మహిళా అధ్యక్షురాలు..

# త్రివేణి పాఠశాలలో ఉగాది, రంజాన్ వేడుకలు ఘనంగా

**సత్తుపల్లి/మార్చి 18ప్రజావినికిడి**
స్థానిక త్రివేణి పాఠశాలలో నేడు ప్రైమరీ విభాగంలో ఉగాది (పరాభవ నామ సంవత్సరం) మరియు రంజాన్ పండుగలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సరిత మాట్లాడుతూ, మన తెలుగు పంచాంగం ప్రకారం ఈ రోజుతో కొత్త సంవత్సరానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. ప్రకృతి మార్పులను ఆధారంగా చేసుకుని ఉగాది పండుగను జరుపుకుంటారని వివరించారు. ఉగాది రోజు ప్రతి ఒక్కరూ ఉగాది పచ్చడి స్వీకరించడం వెనుక ఉన్న విశిష్టతను విద్యార్థులకు వివరిస్తూ, వేపపువ్వు, కొత్త చింతపండు, మామిడికాయ, బెల్లం వంటి షడ్రుచులతో తయారైన పచ్చడి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుందని చెప్పారు.



అనంతరం రంజాన్ పండుగ ప్రాముఖ్యతను వివరించి, ఉపవాసం, దానం, సహనం వంటి విలువలను పిల్లల్లో పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌చార్జ్ వంశీ, కిడ్స్ ఇన్‌చార్జ్ శ్రీ పద్మ, అకడమిక్ ఇన్‌చార్జ్ పవన్ విద్యార్థులకు పండుగ శు




భాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. అలాగే పాఠశాల డైరెక్టర్ జి. వీరేంద్ర చౌదరి, సి.ఆర్.ఓ మురళీ కృష్ణ విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పాఠశాల యాజమాన్యానికి తమ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# పిడుగు పడి ఇల్లు దగ్ధం

## - రోడ్డున పడిన కుటుంబం

**వైరా/మార్చి 18ప్రజావినికిడి**
మండలం పరిధిలోని పుణ్యపూరు గ్రామంలో అకాల వర్షం తీవ్ర నష్టం మిగిల్చింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో కంభంపాటి బక్కయ్య ఇంటిపై పిడుగు పడడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదం సంభవించే వేళ కుటుంబ సభ్యులు భయంతో ఇంటి బయటకు పరుగులు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. అయితే, ఇల్లు పూర్తిగా దగ్ధమవడంతో ఇంట్లో ఉన్న డబ్బులు, బట్టలు, బియ్యం సహా అన్ని గృహోపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో కంభంపాటి బక్కయ్య కుటుంబం ఒక్కసారిగా నిరాశ్రయులుగా మారి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనపై స్పందించిన బాధితులు కంభంపాటి బక్కయ్య, సీతారావమ్మ, నాగరాజు, భారతి, కౌశిక్, కార్తీక్‌లు మండల అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి తమ కుటుంబానికి తక్షణ సహాయం అందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. స్థానిక ప్రజలు కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం, గృహ నిర్మాణం కల్పించాలని కోరుతున్నారు.



# ఉగాదికి వేప పువ్వు దొరికేనా?

## వేపచెట్లకు ఏమైంది?

### పూత లేక ఎండిపోతున్న వేపలు
### -వింత వ్యాధిపై ఆందోళన

**మార్చి 18ప్రజావినికిడి**
);ఉగాది పండుగ వేళ వేప పువ్వు కోసం ప్రజలు పడుతున్న ఇబ్బందులు ఈసారి మరింతగా బయటపడుతున్నాయి. ప్రతి ఇంటిలో ఉగాది పచ్చడికి తప్పనిసరి అయిన వేప పువ్వు కోసం గ్రామాల నుంచి పట్టణాల వరకూ వెతుకులాట కొనసాగుతోంది. అయితే, ఒకప్పుడు ప్రతి ఊరిలో విరివిగా కనిపించే వేపచెట్లు ఇప్పుడు కనిపించడమే అరుదైపోవడంతో పువ్వుల కొరత తీవ్రంగా మారింది.

ఇప్పటికే చాలాచోట్ల వేపచెట్లు పూత లేకుండానే ఎండిపోతుండటం ప్రజలను కలవరపెడుతోంది. కొన్ని చెట్లలో ఆకులు వాడిపోవడం, కొమ్మలు ఎండిపోవడం, పూత రాకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. "మార్చి నెలలోనే చెట్లు పువ్వులతో కళకళలాడేవిడ కానీ ఇప్పుడు చెట్టు నిలబడి ఉన్నా జీవం లేనట్టే ఉంది" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వింత రోగమా?.. వాతావరణ ప్రభావమా?**

వేపచెట్ల ఈ పరిస్థితిపై నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇది వాతావరణ మార్పుల ప్రభావమని చెబుతుండగా, మరికొందరు వేపచెట్లను



ప్రభావితం చేస్తున్న ఒక రకమైన ఫంగల్ లేదా బ్యాక్టీరియా వ్యాధి ఉండొచ్చని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలు, భూగర్భ జలాల లోపం, నేలలో పోషకాల తగ్గుదల కలిసి చెట్ల ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని అభిప్రాయపడుతున్నారు.

**పట్టణీకరణతో తగ్గిన వేపచెట్లు**

పట్టణాల విస్తరణ కూడా వేపచెట్ల తగ్గుదలకు ప్రధాన కారణంగా మారింది. రోడ్ల విస్తరణ, భవనాల నిర్మాణం కోసం పెద్దఎత్తున చెట్లను నరుకుతుండడంతో పాత వేపచెట్లు కనుమరుగైపోతున్నాయి. కొత్తగా నాటే చెట్ల సంఖ్య కూడా తక్కువగానే ఉండటం పరిస్థితిని మరింత తీవ్రతరం చేస్తోంది.

**మార్కెట్‌లో పెరిగిన డిమాండ్**

వేప పువ్వుల కొరతతో మార్కెట్లలో డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. కొన్నిచోట్ల ఎండబెట్టిన వేప పువ్వులను విక్రయిస్తున్నారు. ధరలు కూడా గత సంవత్సరాలతో పోలిస్తే గణనీయంగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. "డిమాండ్ ఎక్కువడ సరఫరా తక్కువ" అన్నట్టుగా పరిస్థితి మారింది.

**ఉగాది ఆనందంపై ప్రభావం**

ఉగాది పచ్చడిలో చేదు రుచికి ప్రతీకగా ఉండే వేప పువ్వు దొరకకపోవడం పండుగ సాంప్రదాయానికే దెబ్బతీస్తోంది. జీవితంలోని కష్టసుఖాలను సూచించే ఆరు రుచుల్లో వేప పువ్వుకు ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి కీలక పదార్థం దొరకకపోవడం పండుగ ఆనందాన్ని తగ్గిస్తోందని ప్రజలు అంటున్నారు.

**పరిష్కారం ఒక్కటే.. వేపచెట్ల పరిరక్షణ**

ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని నిపుణులు ఒకే మాట చెబుతున్నారు"ప్రతి ఒక్కరూ కనీసం ఒక వేపచెట్టు నాటాలి". పర్యావరణ పరిరక్షణపై దృష్టి పెట్టకపోతే భవిష్యత్తులో వేపచెట్లు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఉగాది పచ్చడిలో చేదు కోసం వెతుకులాటడ వేపచెట్ల భవితవ్యంపై మళ్లీ చర్చ మొదలైంది.

# ఆపదలో అండగా పీఆర్టీయూ టీఎస్

### ఉమామహేశ్వర్ కుటుంబానికి రూ.1 లక్షల సహాయం



**హనుమకొండ మార్చి 18ప్రజావినికిడి** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ బాలుర ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించిన రచయిత, కవి, మాజీ పాత్రికేయుడు, పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర మాజీ ప్రచార కార్యదర్శి మెండు ఉమామహేశ్వర్ మరణం సంఘానికి తీరని లోటని పీఆర్టీయూ టీఎస్ నాయకులు పేర్కొన్నారు. బుధవారం మృతుని నివాసానికి వెళ్లిన జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఫలిత శ్రీహరి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంక్షేమ నిధి నుంచి రూ.1 లక్షల చెక్కును అందజేశారు. తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, సంఘంలోని ప్రతి సభ్యునికి పీఆర్టీయూ టీఎస్ అండగా ఉంటుందని, సభ్యుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. శ్రీహరి మాట్లాడుతూ, మృతుని కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావలసిన అన్ని హక్కులు, సదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ ములుగు జిల్లా అధ్యక్షుడు యాకూబ్ రెడ్డి, ధర్మసాగర్ మండల అధ్యక్షుడు అనిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జాన్ సింగ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేశవ రెడ్డి, నాయకులు సురేష్, రవి, జాఫర్గఢ్ మండల మహిళా ఉపాధ్యక్షురాలు నీరజ, వెంకట్ రెడ్డి, మెండు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్తారు విందుతో ఐక్యతకు బలమైన సందేశం

### ధర్మసాగర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహణ -మతసామరస్యానికి నిదర్శనం: ఆర్డీఓ రమేష్ రాథోడ్





**ధర్మసాగర్ మార్చి 18ప్రజావినికిడి** హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలో ధర్మసాగర్‌వేలేరు మండలాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఇస్తారు విందు కార్యక్రమం ఘనంగా జరిగింది. మంగళవారం మండల కేంద్రంలోని ఖుషి లాంచ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి రెండు మండలాల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ ఆర్డీఓ రమేష్ రాథోడ్ విచ్చేసి మాట్లాడుతూ, ఇస్తారు విందు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. సమాజంలో పరస్పర గౌరవం, సహనం, ఐక్యత వంటి విలువలు పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ప్రభుత్వం అన్ని మతాలను సమాన దృష్టితో చూస్తుందని, ప్రతి ఒక్కరూ మతసామరస్యంతో జీవిస్తూ సామాజిక శాంతి, అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర అధికారులు మాట్లాడుతూ, ఇస్తారు విందు ద్వారా భిన్న మతాల మధ్య స్నేహబంధం మరింత బలపడుతుందని తెలిపారు. ఇటువంటి వేదికలు ప్రజల మధ్య అపార్థాలను తొలగించి, పరస్పర అవగాహనను పెంపొందించేందుకు దోహదపడతాయని చెప్పారు. సమాజంలో సౌభ్రాతృత్వాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు.

ఈ సందర్భంగా నిర్వహించిన విందులో పాల్గొన్న వారు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ స్నేహపూర్వక వాతావరణంలో గడిపారు. మత పెద్దలు కూడా ఐక్యత, శాంతి, సామరస్యానికి సంబంధించిన సందేశాలను



అందించారు.

ఈ కార్యక్రమంలో ధర్మసాగర్ ఎమ్మార్వో సదానందం, ఎంపీడీవో అనిల్ కుమార్, వేలేరు ఎమ్మార్వో కొరిమి, వేలేరు ఎంపీడీవో, ధర్మసాగర్ ఎస్‌హెచ్‌ఓ శ్రీధర్ రావు, మత పెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు సంస్థ షాక్

### ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్ రద్దు

హైదరాబాద్,**మార్చి 18ప్రజావినికిడి**
ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బిగ్ షాక్ ఇచ్చింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద ఇచ్చే స్పెషల్ ఇంక్రిమెంట్‌ను రద్దు చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్టీసీ బోర్డు తీర్మానం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. ఇకపై ఉద్యోగులు, వారి జీవిత భాగస్వామి.. ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నా ఈ ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వబోమని యాజమాన్యం స్పష్టం చేసింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ సర్క్యులర్ జారీ చేసింది. ఫ్యామిలీ ప్లానింగ్ స్కీం కింద స్పెషల్ క్యాజువల్ లీవ్ మాత్రమే కొనసాగుతుందని తెలిపింది. ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. గతంలో ఈ స్కామ్ ద్వారా కుటుంబ నియంత్రణను ప్రోత్సహించేవారు.

----

# మక్కలు మార్కెట్లోకి వచ్చిన కొనుగోళ్లు ఏవీ

### ప్రభుత్వ తీరుతో రైతులకు తీవ్రనష్టం
### గన్‌పార్క్ వద్ద బిఆర్ఎస్ నేతల ఆందోళన
### వెంటనే మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్






హైదరాబాద్,**మార్చి 18ప్రజావినికిడి** రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిలదీస్తూ, రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్ రావు, ఎమ్మెల్సీ శ్రవణ్, ఎమ్మెల్యేలు ఆందోళనకు దిగారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని నినాదాలు చేశారు. మార్కెట్లకు పోటెత్తిన మక్కలను కొనుగోలు చేయకపోవడంతో రైతన్నకు తిప్పలు అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ బీఆర్ఎస్ నేతలు నినాదాలు చేశారు. మొక్కజొన్నలతో గన్‌పార్క్‌లో నినాదాలు చేసిన గులాబీ పార్టీ నేతలు.. అక్కడి నుంచి కాలినడకన అసెంబ్లీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా గన్‌పార్క్ వద్ద తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన అనంతరం మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. వరి వేయొద్దని, పంట మార్పిడి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పదేపదే చెబితే.. ఆ మాటలు నమ్మి రాష్ట్రంలో రైతులు సుమారు 8 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారని తెలిపారు. తీరా పంట చేతికి వచ్చాక ఆ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతోందని అన్నారు. మొక్కజొన్న మార్కెట్లకు రావడం మొదలై ఇప్పటికే 15 రోజులు అవుతున్నా, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడం దారుణమని మండిపడ్డారు. దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మొక్కజొన్నకు మద్దతు ధర రూ. 2400 ఉంటే.. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు బయట మార్కెట్లో దళారులకు రూ. 1600 నుంచి 1700లకే అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

# పెద్దవాగు ప్రాజెక్టుపై నిర్లక్ష్యం.. రైతుల్లో ఆందోళన

### రెండేళ్లైనా పునర్నిర్మాణం పూర్తి కాకపోవడంపై బీజేపీ ఆగ్రహం

**కొత్తగూడెం/ మార్చి 18 (జర్నలిస్ట్ వార్త):మార్చి 18ప్రజావినికిడి** త్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలంలోని పెద్దవాగు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని బీజేపీ నాయకుడు తంబళ్ల రవి ఆరోపించారు. ప్రాజెక్టు కట్ట తెగి దాదాపు రెండేళ్లు గడిచినా ఇప్పటికీ పునర్నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రైతులు, మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ప్రాజెక్టును బీజేపీ నాయకులతో కలిసి సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. వరదల వల్ల నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు సరైన పరిహారం అందలేదని, ప్రభుత్వ స్పందన ఆశించిన స్థాయిలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



సాగునీటి కోసం పూర్తిగా ఈ ప్రాజెక్టుపై ఆధారపడిన పరిసర గ్రామాల రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు.

పునర్నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపిస్తూ, నిర్మించిన రింగు బండ స్థిరత్వంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నాసిరకం పనుల వల్ల రాబోయే వర్షాకాలంలో మళ్లీ కట్ట దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. చెరువు ఆధారంగా జీవనం సాగిస్తున్న మత్స్యకారులకు కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి భరోసా కల్పించలేదని విమర్శించారు. ఉపాధి కోల్పోయిన వారికి ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించి నాణ్యమైన పద్ధతుల్లో కట్టను బలోపేతం చేసి, ప్రాజెక్టును పూర్తి స్థాయిలో రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సమస్యలను నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గూడా ముత్యాలరావు, కారం రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



# పరాభవనామ ఉగాది!



మార్చి 18ప్రజావినికిడి

కాలం ఒక ప్రవాహం! కాలం దైవ స్వరూపం. నిరంతరంగా సాగుతూనే ఉంది. ఈ ప్రకృతి ఎప్పుడు మొదలయ్యిందో తెలియదు కానీ..మానవుడు తనకు ఊహ తెలిసి, జ్ఞానం సముపార్జించాక సూర్యచంద్రుల గతులను బట్టి..కాల నిర్ణయం చేశాడిన చెబుతారు. పురాణాల ప్రకారం కాలం అనంతం. కాలానికి తగ్గట్టుగా కర్మలు నెరవేర్చడంతోనే మనిషి 'జ్ఞాన ప్రయాణం' మొదలైంది. అదే ఈ యుగానికి.. 'ఆది' అయింది. కాల మహిమను గుర్తు చేసుకుంటూ తెలుగు వారు చేసుకునే మొదటి పండుగే ఉగాది! చైత్రమాసం...వసంత రుతువు కూడా కాలానికి మార్పుగా గుర్తించాలి. ఉగాది నుంచే బ్రహ్మదేవుడు సృష్టి ఆరంభించాడని, యుగాది కాస్తా ఉగాది అయ్యిందన్న ప్రచారం కూడా ఉంది. కాలాన్ని ఆపడం, దానికి ఎదురెళ్లడం ఎవరి తరమూ కాదు. అయితే, మనిషి తన అవసరాలకు అనుకూలంగా కాలాన్ని విభజించుకున్నాడు. అలా కాలాన్ని పరిశీలించుకుంటూ దానికి తగ్గట్లు నడుచుకుంటూ తన బుద్ధికి పదును పెట్టుకున్నాడు. అలా ఉగాది పండుగను తొలి అడుగుగా గుర్తించాడు. చైత్రశుద్ధ పాడ్యమి సూర్యోదయ సమయంలో బ్రహ్మ ఈ జగత్తును సంపూర్ణంగా సృష్టించాడు. అని సమాధానం చెప్పాడు. ఇది ఇలా ఉంచితే మన దేశంలో పుష్య–మాఘ మాసాలు పంటలు పండి ప్రకృతి రసభరితంగా ఉండేకాలం. ప్రజలు తమ శ్రమ ఫలితాన్ని కట్టెదుట చూస్తూ పొంగి పోతారు.ఇదే మొదట్లో మన సంవత్సరాది. దీనిని సూచించే దినం మకర సంక్రమణం.ఇది మార్గశిర– పుష్య–మాఘమాసాల మధ్యన వచ్చేది విషువత్కాలం. విషువత్కాలమంటే పగలూ రాత్రీ సరిసమానంగా ఉండే కాలం. సమరాంత్రిందివే కాలే విషువత్ అన్నాడు అమరసింహుడు. ఈ విషువత్తులు రెండు.మకర సంక్రాంత్రి అలాంటి విషువత్తు లలో ఒకటి. ఈనాటి నుంచి ప్రకృతిలో క్రొత్త క్రొత్త మార్పులు కలగడం ఆరంభం అవుతుంది.మనకొక సంవత్సరమైతే దేవతలకొక దినం. వారి దినం మేషంతో ప్రారంభమౌతోంది; మానవుడు ఋతువులు తన లెక్కలకు ముందు వెనకలుగా రావడం చూచి, సూర్యచారాన్ని తక్కిన గ్రహాల చారాన్ని లెక్కలు కట్టసాగాడు.సూర్యుడు విషువత్తులో ప్రవేశించిన నాటినుంచి లెక్కకట్టి రాసులు విభజించాడు. ఈవిధంగా నభో మండలం– 12 భాగాలు అయినది. ఆరాసులతోనే మాస సంకేతం చేసుకున్నాడు. సూర్యుడు ఒక రాశినుంచి మరొకరాశికి ప్రవేశించడానికి దాదాపు 30, 31 దినాలవుతుంది. కాని చంద్రుని వృద్ధిక్షయాలతో ఏర్పడిన నెలకు, తర్వాత సూర్యమానపు నెలకూ క్రమంగా నెలవారా రావడం మొదలైంది. చంద్రమానానికి 19 సం.లకు ఏడు అదనపు నెలలు చేర్చి రెండు మానాలను సర్దుకోవలసి వచ్చించి.కనుకనే ప్రతి మూడోఏటా చంద్రమాన సం.లో ఒక అధిక మాసం వస్తూవుంటుంది. నిజానికి చంద్రమానమే వేదకాలం నుంచి ఆచరణలో ఉన్నదేమో!! సౌరమానం వ్యవహారంలో ఉన్న ప్రాంతాలలోనూ వైదిక కర్మలకు చంద్రమానాన్ని అనుసరించడమే దీని ప్రాచీనతకు ప్రమాణం. ఉత్తరాయణం వసంత రుతువు శుక్ల పక్షం ప్యాద్యమి తిథి.. ఉగాది పండుగ ఈ ఏడాది మార్చి 19న వచ్చింది. అనాదిగా వస్తున్న ఈ ఉగాది.. 'యుగాది'. అన్న సంస్కృత పదం నుంచి పుట్టింది. మన వేదాలకు మంత్ర సృష్టి జరిగిన రోజు. సూర్యుడు మేషరాశిలో ప్రవేశించే రోజు. కాలం వసంతంలోకి అడుగు పెట్టిన రోజునే ఉగాది. పండుగగా, కొత్తసంవత్సరాదిగా తెలుగువాళ్లు జరుపుకుంటున్నారు. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో ఈ ఉగాది జరుపుకోవడం ఆచారంగా వస్తోంది. మన సంప్రదాయంలో ఏ పండుగను చూసినా అది ప్రకృతితో ముడిపడి ఉంటుంది. అందులోనూ ఉగాది అయితే దాన్ని ఏకోణంలో చూసినా ప్రకృతి ఆధారంగానే కనిపిస్తుంది. వసంత రుతువు వచ్చిందని తెలియజేసే పండుగఉగాది. ఉగాది నాటికి చుట్టు పక్కన ఏ చెట్టును చూసినా లేత ఆకులతో పచ్చగా కనువిందు చేస్తుంటుంది. ఆ సంతోషం కోయిల పాటల్లో, నెమలి నాట్యాల్లో కనిపిస్తుంది. ఉగాది పండుగ వెనక ఉన్న కథనాన్ని ఒక్కొక్కరూ ఒక్కో విధంగా చెప్తారు. ఉగాది.. 'ఉగ' అంటే నక్షత్ర గమనం. జన్మ ఆయుష్షు అని అర్థాలు ఉన్నాయి. వీటికి అది ఉగాది అంటే ఈ ప్రపంచంలో పుట్టిన ప్రతి జీవి ఆయుష్షుడు మొదటిరోజునే ఉగాదిగా మారిందంటారు. చైత్ర శుద్ధ పాడ్యమి నాడే కలియుగం మొదలైందని.. త్రేతాయుగంలో ఉగాది రోజే శ్రీరాముడికి పట్టాభిషేకం జరిగిందని మరో కథనం.. ఈ రోజే శ్రీమహావిష్ణువు మత్స్యావతారంలో సోమకాసురుని సంహరించి వేదాలను బ్రహ్మకు అప్పగించాడని, బ్రహ్మదేవుడు సృష్టిని మొదలు పెట్టిన రోజే ఉగాదని అంటారు. మొదటి తెలుగు చక్రవర్తి శాలివాహనుడు. ఉగాది రోజునే సింహాసనాన్ని అధిష్టించాడనేది కూడా ప్రచారంలో ఉంది. ఉగాది రోజు నుంచే తెలుగు సంవత్సరం మొదలవుతుంది. కాబట్టి ఇది తెలుగువారి మొదటి పండుగగా పేరుగాంచింది. అయితే, తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఉగాదిని గొప్పగా జరుపు కుంటారు.. కర్నాటకలో ఉగాదిమహారాష్ట్రలో గుడిపాడ్వా, తమిళనాడులో 'పుత్తాండు అనే పేరుతో, కేరళలో 'విషు', పంజాబ్‌లో 'వైశాఖీ', బెంగాల్లో పొయ్లా బైశాఖ్ ' అనే పేర్లతో ఉగాది జరుపుకుంటారు. రెండు మూడు రోజుల ముందు నుంచే పండగ పనులు మొదలవుతాయి. ఉగాది రోజు పొద్దున్నే ఇంటిని శుభ్రం చేసుకుంటారు. తైల అభ్యంగన స్నానం చేసి గుమ్మానికి మామిడి తోరణాలు, వేపాకు తోరణాలు కడతారు. కొత్త బట్టలు వేసుకొని కొత్త కుండ కొనడంతో సందడి మొదలవుతుంది. ఒకవైపు పచ్చడి తయారు చేస్తుంటే..మరోవైపు వేడివేడిగా భక్ష్యాలు తయారవు తుంటాయి. ఉగాది పచ్చడి...వంటలు ఇష్టమైన దేవునికి నైవేద్యంగా పెట్టి కొత్త సంవత్సరం అంతా శు భం కలగాలని కోరకుంటారు. తర్వాత ఇంటిల్ల పాది పరగడపున ఉగాది పచ్చడి తిని, తర్వాత.. భక్ష్యాలు తింటారు. కొత్త పనులు, కొత్త వ్యాపారాలు కూడా ఉగాది నాడు మొదలు పెడుతుంటారు కొందరు. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. ఈ పంచాంగ శ్రవణం వినడం పట్ల ఈ సంవత్సరంలో జరగబోయే మంచి చెడులతో పాటు పరిణామాలు తెలుసుకుంటారు. కలియుగంలో నక్షత్ర ఫలితాలతో పాటు రాశిఫలాలు.. ఆదాయ వ్యయాలు, రాజపూజ్య అవమానాలు తెలుసుకుంటారు. ఇది జాగ్రత్తగా నడుచుకోవడానికి ఉపయోగపడుతుంది.

## ఉగాది పచ్చడి వైశిష్ట్యం కాలంలో మార్పులను తట్టుకునే ఔషధం




తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. తెలుగు పంచాంగం ప్రకారం చైత్రమాసం శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పండుగతో కొత్త సంవత్సరం ఆరంభం కానుంది. ఈ ఏడాది ఉగాది పండుగ మార్చి 19న వచ్చింది. ఉగాది పండుగ రోజు అందరూ కచ్చితంగా ఉగాది పచ్చడి తినాలని పండితులు చెబుతుంటారు. అసలు ఆ రోజు ఉగాది పచ్చడి ఎందుకు తినాలి. ఎన్ని రోజులు

వసంత గమన శుభవేళ.. పచ్చగా కళకళలాడే ప్రకృతి పరంగా.. రేవతి నక్షత్ర ప్రవేశంతో.. చైత్ర శుద్ధ పాడ్యమి గురువారం రోజున ఉగాది పండుగ .. శ్రీ పరాభవ నామ సంవత్సర కాలగమనం ఆరంభమవుతుంది. ఉగాది పచ్చడిని ఒక్కో చోట ఒక్కో విధంగా తయారు చేస్తుంటారు. అందులో తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు అనే ఆరు రుచులను తప్పకుండా ఉండేలా చూస్తారు. ఈ పచ్చడి కోసం చెరకు, అరటి పళ్ళు, మామిడి కాయలు, వేప పువ్వు చింతపండు, జామకాయలు, బెల్లం, జీలకర్ర, మిరపకాయ వంటివి వాడుతుంటారు. ఇన్ని కలిపి చేసిన ఉగాది పచ్చడిని ఒక మహాఔషధమని అంటారు పెద్దలు. ఈ ఉగాది పచ్చడిని ఈ పండుగ నుంచి శ్రీరామనవమి వరకూ లేదాచైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ ఉంటే శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని. ఆ సంవత్సరమంతా రోగాలేవీ దరిచేరవనే నమ్మకం కూడా ఉంది. ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఉగాది పచ్చడిని నింబకుసుమ భక్షణం...అశోకకళికా ప్రాశనం అంటారు. రుతువులలో వచ్చే మార్పుల వల్ల వచ్చే రోగాల నుంచి రక్షణగా, ఈ పచ్చడిని ఔషధంగా తీసుకోవడం పూర్వం నుంచే అనవాయితీగా వస్తోంది. పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ అమ్మోరు వంటి అంటురోగాలను దగ్గరకి రానివ్వకుండా కాపాడుతుంది మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉంది. మిరియాలు దగ్గు జలుబు, పైత్యాలను అదుపులో ఉంచుతాయి. బెల్లం రక్తాన్ని శుద్ధి చేస్తుంది. చింతపండు మలబద్దకాన్ని, నీరసాన్ని తగ్గిస్తుంది. ఉప్పు ఎండాకాలంలో వచ్చే హైడ్రేషన్ని తగ్గిస్తుంది. సంవత్సరం అంతా ఎదురయ్యే మంచి చెడులను, కష్ట సుఖాలను సమానంగా తీసుకోవాలనే సందేశాన్ని కూడా ఉగాది పచ్చడి ఇస్తుంది. బెల్లం– తీపి అనేది సంతోషానికి, ఉప్పు– జీవితంలో ఉత్సాహానికి... వేప పువ్వు– చేదు బాధ తాలూకు అనుభవాలకు, చింతపండు– పులుపు నేర్పుగా వ్యవహరించాల్సిన పరిస్థితులకు, పచ్చి మామిడి ముక్కల పులుపు– కొత్త సవాళ్లకు.. కారం సహనం కోల్పోయేట్టు చేసే పరిస్థితులకు సంకేతం అని చెప్తారు.ఉగాది పచ్చడి ఒక మహాఔషధమని పెద్దలు చెబుతుంటారు. ఈ ఉగాది పచ్చడిని శ్రీరామ నవమి వరకూ లేదా చైత్ర పౌర్ణమి వరకు ప్రతిరోజూ తీసుకోవాలి. అలా 9 లేదా15 రోజుల పాటు ఈ ఉగాది పచ్చడి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందంటారు. ఉగాది పచ్చడిలో ఉండే వేప పువ్వు కడుపులో ఉన్న నులిపురుగులను చంపేస్తుంది. వేపగాలి ఆటలమ్మ, అమ్మోరు మొదలైన వ్యాధులను దగ్గరకు రానీయదు. మామిడి యాంటీ వైరల్ లక్షణాలు కలిగి ఉన్నది. ఇది కఫము, వాతము, పైత్యాలనే మూడు దోషాలను అదుపులో ఉంచుతుంది. మనకు వచ్చే జబ్బుల్లో చాలా వరకూ వీటివల్లే వస్తాయి.. 'శతాయుర్వజ్ర దేవయ సర్వ సంపత్రాయచ.. సర్వతిష్ట వినాశయ నిబంకదళ బక్షణమ్' అనే శ్లోకం పఠించి ఉగాది ప్రసాదాన్ని స్వీకరించాలి. పంచాంగ శ్రవణం వినాలి. మంచి ఆశయాలతో ముందడుగు వేయాలి. ఆ రోజున (మార్చి 19) పంచాంగాన్ని విన్న పక్షంలో ఏ గ్రహం మనకి అనుకూలంగా లేదో, ఎవరు మనకి సహాయకులో తెలిసి, ఏయే కష్ట నష్టాలో తెలుసుకొని వాటికి సంబంధించిన ప్రత్యామ్నాయ మార్గాలను ఎన్నుకోగలుగుతామని పండితులు చెబుతున్నారు.

-----

## కొత్త జీవితం ప్రారంభానికి సూచిక

### సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకోవడం ఆనవాయితీ



ఉగాది పండుగ తెలుగు వారి జీవితాల్లో కొత్త ఆశలను నింపే పండగు. సంస్కృతి.. సంప్రదాయాలకు.. ధర్మబద్ధ జీవన విధానాన్ని ప్రారంభించిన రోజు. ఇలాంటి ముఖ్యమైన రోజున మన జీవితాలను ఆధ్యాత్మిక పరంగా.. సేవా పరంగా ఎన్నో కార్యక్రమాలు చేయాలని పండితులు చెబుతున్నారు. చైత్ర శుద్ధ పాడ్యమి తిథి ఉదయం 6.53 గంగలకు ప్రారంభమవుతుంది. పాడ్యమి తిథి మార్చి 20 ఉదయం 04:54 గంటలకు ముగుస్తుంది. కావున పండితులు తెలిసిన వివరాల ప్రకారం ఉదయం సమయంలో పాడ్యమి తిథి ప్రాబల్యం ఉండటం వల్ల మార్చి 19నే ఉగాది పర్వదినంగా భావిస్తారు.ఉగాది రోజున ప్రాత: కాలంలో కాలకృత్యాలు తీర్చుకొని ఇంటిని శుభ్రం చేసుకోవాలి. తరువాత ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలు కట్టి.. గడపలను పసుపు.. కుంకుమతో అలంకరించాలి. పూజా మందిరంలో కలశాన్ని ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబంలో కలశాన్ని ఏర్పాటు చేసుకొనే ఆచారం లేకపోతే అవసరం లేదు. కుల దైవాన్ని ఆవాహన చేసుకోవాలి. ముందుగా కొత్త సంవత్సరానికి సంబంధించిన సంకల్పాన్ని చెప్పుకొని.. గణపతి పూజ చేసుకొని.. విష్ణుమూర్తిని.. లక్ష్మీదేవిని.. పరమేశ్వరునికి పూజలు చేయాలి. షోడసోపచార పూజలు చేసి.. ధూపం.. దీపం.. హారతి తరువాత ఉగాది పచ్చడిని స్వామివారికి నివేదించి ప్రసాదంగా తీసుకోవాలి. ఉగాది పచ్చడిని నైవేద్యంగా సమర్పించడం ద్వారా జీవన తత్వాన్ని గుర్తుచేసుకుంటారు.తరువాత మహానివేద్యం సమర్పించాలి. ఈ విధంగా చేయడం ఎంతో కాలంగా వస్తున్న ఆచారం.. ఇంట్లో పూజ అనంతరం... దగ్గరలోని దేవాలయానికి వెళ్లాలి. ఉగాది రోజున పంచాంగ శ్రవణం వినాలి. ఇది ఒక ప్రాచీన ఆచారమని పండితులు చెబుతున్నారు. పంచాంగం అనేది తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం వంటి 5 ముఖ్య అంశాలను వివరిస్తుంది. కొత్త సంవత్సరంలో జరిగే ఖగోళ మార్పులు .. వాటి ప్రభావాలను తెలియజేస్తాయి. పంచాంగ శ్రవణం ద్వారా ఆ సంవత్సరంలో వర్షపాతం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు, రాజకీయ స్థితిగతులు, సామాజిక శాంతి వంటి అంశాలపై సంక్షిప్త అవగాహన లభిస్తుంది. తరువాత బ్రాహ్మణులకు వస్త్రదానం .. దక్షిణ తాంబూలం ఇచ్చి.. వారి ఆశీర్వాదాలను తీసుకోవాలి. తెలుగు పంచాంగం ప్రకారం మొత్తం 60 సంవత్సరాలు ఉంటాయి. ఇవే పునరావృతమవుతుంటాయి. ఈ ఏడాది 2026 లో మార్చి 19న కొత్త తెలుగు సంవత్సరం పరాభవనామ సంవత్సరం ప్రారంభమవతుంది. పరాభవం అంటే లోపాలను అధిగమించి ఉన్నత స్థితిని చేరుకొనే సమయాన్ని సూచిస్తుందని పండితులు చెబుతున్నారు. కొత్త సంవత్సరంలో ఆధ్యాత్మికత.. వినయం.. ఆత్మపరిశీలన.. సేవాగుణాన్ని వృద్ధి చేసే సందేశాన్ని ఇస్తుంది.

## ఉగాది రోజు ఆలయదర్శనం శుభం

తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మార్చి 19వ తేదీ గురువారం ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారంతా భక్తి శ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఈ రోజు ఏం చేస్తే.. ఏడాదంతా అదే జరుగుతుందనే ఒక భావన తెలుగు ప్రజలలో బలంగా ఉంది. గతేడాది కొంత కష్టంగా ఉంది. ఈ ఏడాది అయినా బాగుంటుందా అని చాలా మంది అనుకుంటూ ఉంటారు. అలాంటి వారు ఉగాది పర్వదినం వేళ.. ఇలా చేయడం వల్ల ఏడాదంతా శుభ ఫలితాలు పొందవచ్చని పండితులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల కష్టాలు తొలగి.. ఆనందంగా ఉండొచ్చని అంటున్నారు. కొత్త ఏడాది ఎలా ఉండబోతోంది.. గ్రహాల ప్రభావం ఏ రాశుల మీద ఎలా ఉందనేది పండితుల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పండగ రోజు.. దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకుంటే కుటుంబానికి శుభం కలుగుతుందని పండితులు చెబుతారు.ఆ రోజు పెద్దల ఆశీర్వాదం తీసుకోవాలి. అలా తీసుకోవడం వల్ల ఆయురారోగ్యాలు, విజయాలు కలుగుతాయి. ఉగాది వేళ.. మీకు తోచిన వాటిని దానం చేస్తే ఎంతో పుణ్యం కలుగుతుంది. అన్నదానం, వస్త్రదానం ఇలా ఏదైనా చేయవచ్చు. ఉగాది రోజు కొత్త పనులు ప్రారంభిస్తే మంచి ఫలితాలు సంప్రాప్తిస్తాయి. చేపట్టిన పనుల్లో అడ్డంకులు ఉండవు. కొత్త ఏడాది మంచి ఆలోచనలతో ప్రారంభించాలి. ఉగాది నుంచి ఈ ఏడాది అంతా బాగా కలిసి రావాలని మనస్సులో సంకల్పం చెప్పుకొని.. కొత్త పనులు ప్రారంభించాలి. ఉగాది రోజు గణపతి ఆలయానికి వెళ్లి గరికను సమర్పిస్తే శుభం కలుగుతుంది. ఎర్రటి పుష్పాలను సమర్పిస్తే.. శుభ ఫలితాలు కలుగుతాయి. వినాయకుడు విఘ్నాలను తొలగిస్తాడు. ఈ రోజు ఓం గం గణపతయే నమ: అంటూ సాధ్యమైనన్ని సార్లు ఈ మంత్రాన్ని స్మరణ చేసుకోవాలి. ఉగాది రోజు ఇలా చేయడం వల్ల ఏడాదంతా ఐశ్వర్యం, ఆనందం, శుభాలు కలుగుతాయి.



# అదనంగా మరో పదిశాతం ఎల్‌పిజి

## తాజాగా ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ,,మార్చి 18ప్రజావినికిడి**



**ఇరాన్**, అమెరికా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా దేశంలో తలెత్తిన ఎల్‌పీజీ కొరతను అధిగమించేందుకు కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అదనంగా మరో 10 శాతం కమర్షియల్ ఎల్‌పీజీ అందించేందుకు అంగీకరించింది. అయితే ఎల్‌పీజీ భారాన్ని తగ్గించి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకాన్ని పెంచే రాష్ట్రాలకు మాత్రమే ఈ అదనపు సరఫరా వర్తిస్తుందని తెలిపింది. ఆ ప్రకారం ఎల్పీజీ నుంచి పీఎన్‌జీకి మారేలా రాష్ట్రాలు ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం చేయాల్సి ఉంటుంది. దేశీయ వంటగ్యాస్ సరఫరాకు ఆటకం కలగకుండా చూడటం, వాణిజ్య అవసరాల కోసం గ్యాస్ కొరత తీర్చడం ప్రభుత్వ ముఖ్యోద్దేశమని పెట్రోలియం మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ తెలిపారు. సీజీడీ అప్లికేషన్ల అప్రూవల్, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసినట్లయితే 1 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని, డీమ్డ్ సీజీడీ పర్మిషన్లు ఇచ్చేందుకు ఉత్తర్వులు జారీ చేస్తే 2 శాతం, రోడ్ల తవ్వకం, మరమ్మతు పథకం ప్రవేశపెడితే 3 శాతం, వార్షిక రెంటల్/లీజ్ తగ్గిస్తే 4 శాతం అదనపు కేటాయింపులు జరుపుతామని ఆమె చెప్పారు. ఎల్‌పీజీ అంశం ఇంకా ఆందోళనకరంగానే ఉన్నప్పటికే ఆన్‌లైన్ బుకింగ్ పరిస్థితి మెరుగుపడిందని సుజాత శర్మ తెలిపారు. ఈనెల 17న 2,300కు పైగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. చాలా రాష్ట్రాలు ఇప్పటికే స్టేట్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కాగా, ఎల్పీజీ సరఫరాలపై ఒత్తిడిని తగ్గించేందుకు హాస్పిటాలిటీ, రెస్టారెంట్లతో సహా పలు రంగాలకు కిరోసిన్, బొగ్గు సరఫరాలకు కేంద్రం ఇప్పటికే ఆదేశాలిచ్చింది.

# ఏఎస్ఐ అనుమానాస్పద మృతి



**విజయవాడ,,మార్చి18,( జర్నలిస్ట్ జర్నీ న్యూస్):**, కృష్ణా జిల్లా యనమలకుదురులో ఏఎస్ఐ అనుమానాస్పదంగా మృతి చెందారు. పడమట పోలీస్ స్టేషన్ లో ఏఎస్ఐ గా చేస్తున్న వీరవల్లి గోపి వెంకట దుర్గాప్రసాద్ (54) ఒక కేసు విషయంలో 15 రోజుల క్రితం సస్పెన్షన్ కు గురైన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైనన్నారు. ఈ క్రమంలో యనమలకుదురు కరకట్ట శివారు ఒక పాకలో శవమై తేలారు. ఘటన స్థలానికి చేరుకున్న పెనమలూరు పోలీసులు హత్య లేక ఆత్మహత్య అన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

# ఆ యువకుడు చెప్పిన మాటలను అంత సులభంగా మర్చిపోలేను

## : పవన్ కల్యాణ్ భావోద్వేగ పోస్ట్

**ఏపీలో 'దివ్యాంగ శక్తి' పథకం ప్రారంభం**

**దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం**

**సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శ్రీకారం**

**బస్సులో ఓ యువకుడితో సంభాషణను పంచుకున్న పవన్ కల్యాణ్**

**రెండింతల ఆర్థిక భారం తగ్గుతుందన్న యువకుడి మాటలు మర్చిపోలేనన్న పవన్**



**విజయవాడ,మార్చి 18ప్రజావినికిడి :,**
ఏపీ ప్రభుత్వం దివ్యాంగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో వారికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ 'దివ్యాంగ శక్తి' అనే పథకాన్ని ప్రారంభించింది. ఇవాళ విజయవాడలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంగళగిరి బస్ డిపో నుంచి పెనుమాక వరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించారు. వారి బాగోగులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ ప్రయాణంలో తన అనుభవాలను, ముఖ్యంగా ఓ యువకుడితో జరిపిన సంభాషణను డిప్యూటీ సీఎం పవన్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఆ యువకుడు చెప్పిన మాటలను అంత సులభంగా మర్చిపోలేనంటూ ఆయన భావోద్వేగభరిత పోస్ట్ పెట్టారు. "దివ్యాంగుల సమస్యలు వినాలనుకునే వ్యక్తిగా పల్లె వెలుగు బస్సు ఎక్కాను. వారి మాటల్లోని నిజాయితీ, శక్తి నన్ను ఆకట్టుకున్నాయి. అయితే, ఓ యువకుడితో జరిపిన సంభాషణ నా మదిలో నిలిచిపోయింది" అని పవన్ పేర్కొన్నారు. స్పెషల్ ఎడ్యుకేటర్‌గా శిక్షణ పొందుతున్న జేఎన్‌టీయూ విద్యార్థి అయిన ఆ యువకుడు, ఆర్థికవేత్త అమర్త్య సేన్ చెప్పిన 'డబుల్ హ్యాండికాప్' అంశాన్ని ప్రస్తావించాడని పవన్ తెలిపారు. సాధారణ వ్యక్తులతో పోలిస్తే, దివ్యాంగులు సాధారణ జీవితం గడిపేందుకు రెండింతల ఆర్థిక భారాన్ని మోయాల్సి ఉంటుందని ఆ యువకుడు వివరించినట్లు పవన్ పేర్కొన్నారు. 'దివ్యాంగ శక్తి' పథకం ఈ ఆర్థిక భారాన్ని తగ్గించడమే కాకుండా, రాష్ట్రానికి, దేశానికి సేవ చేసే అవకాశం కల్పిస్తుందని, అదే ఈ పథకానికి సార్థకత అని ఆ యువకుడు చెప్పిన మాటలు తనను కదిలించాయని పవన్ అన్నారు.నిత్యం సవాళ్లను ఎదుర్కొంటూ కూడా దేశ నిర్మాణం గురించి ఆలోచిస్తున్న ఆ యువకుడి దృక్పథం చాలా గొప్పదని కొనియాడారు. 'దివ్యాంగ శక్తి' కేవలం రవాణా సౌకర్యం కాదని, అది సమాజానికి తిరిగి సేవ చేసేందుకు ఇచ్చిన అవకాశమని పవన్ అభివర్ణించారు. మనం ఇంకా చేయాల్సింది చాలా ఉందని ఈ రోజు తనకు స్పష్టంగా గుర్తు చేసిందంటూ పవన్ కల్యాణ్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

# మొయినాబాద్ కేసులో కొత్తకోణం

## మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు సిట్ గుర్తింపు


**హైదరాబాద్,మార్చి 18ప్రజావినికిడి**
మొయినాబాద్ ఫార్మ్ హౌస్ డ్రగ్స్ కేస్ లో కొత్త కోణం వెలుగు చూసింది. ఫార్మ్ హౌస్ పార్టీలో నిందితులు మూడు రకాల డ్రగ్స్ వాడినట్లు సిట్ బృందం గుర్తించింది. కోకేన్, ఎండిఎంఏ డ్రగ్స్ వాడినట్లు గుర్తించింది. ముఖ్యంగా నమిత్ శర్మ మూడు రకాలు వాడినట్లు నిర్దారించారు. పైలట్ రోహిత్ రెడ్డి రెండు రకాల డ్రగ్స్ వాడినట్లు అధికారులు తేల్చారు. ఇక అర్జున్ రెడ్డితో పాటు మిగిలిన నిందితులు ఎండిఎంఏతో పాటు మేతోతిపెన్ వాడినట్లు తెలిపారు. పోలీసులు అధిక కిక్ కోసం రోహిత్ నమిత్ శర్మ కాస్ట్లీ మద్యంతో పాటు డ్రగ్స్ కలిపి తీసుకున్నట్లు గుర్తించారు పోలీసులు. పార్టీకి సిమ్లా నుంచి కౌశిక్ డ్రగ్స్ తీసుకొచ్చినట్లు నిర్ధారించారు అధికారులు. అభిషేక్ నుంచి రెండు రకాల డ్రగ్స్ కొనుగోలు చేశాడు. పైలట్ డ్రైవర్ రోహిత్ ఓఆర్ఆర్ దగ్గర కొనుగోలు చేసినట్లు తేల్చారు.అడ్వకేట్ కౌశిక రవి తాను బిజినెస్ ట్రిప్ కోసం సిమ్లాకి వెళ్ళినప్పుడు అక్కడికి గుర్తు తెలిన వ్యక్తుల దగ్గర నుంచి దాదాపు 15,000 రూపాయలు చెల్లించి తీసుకొని వచ్చినట్లుగా పేర్కొన్నారు. అయితే మిగతా డ్రగ్స్ మిగతా రెండు రకాల డ్రగ్స్ ఎక్కడి నుంచి వచ్చాయి అనే విషయం తెలుసుకున్నప్పుడు పైలట్ రోహిత్ డ్రైవర్ అయిన శరత్ ఈ రెండు రకాల డ్రగ్స్ తెచ్చినట్లుగా అధికారులు గుర్తించారు.

# రాజాసింగ్‌కు మరోమారు బెదిరింపు లేఖ చంపేస్తామని బెదరింపులు

**హైదరాబాద్,,మార్చి 18ప్రజావినికిడి :,**:గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ప్రాణహాని తలపెట్టేలా బెదిరింపు లేఖ రావడం భాగ్యనగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. గతంలో కూడా ఆయనకు పలుమార్లు అంతర్జాతీయ నంబర్ల నుంచి, సోషల్ మీడియా ద్వారా బెదిరింపులు వచ్చినప్పటికీ, ఈసారి ఈనెల 27 స్పష్టంగా పేర్కొంటూ లేఖ రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈనెల 27వ తేదీలోగా రాజాసింగ్‌ను చంపేస్తామంటూ ఆగంతకులు ఆ లేఖలో హెచ్చరించినట్లు సమాచారం. ఇటీవల ఆయన చేసిన ప్రసంగాలతోనే ఈ బెదిరింపులకు దిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాజాసింగ్ చుట్టూ భారీ భద్రత ఉన్నప్పటికీ, ఇలాంటి లేఖలు రావడం ఆయన అనుచరుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ లేఖ అందిన వెంటనే రాజాసింగ్ కార్యాలయ ప్రతినిధులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ లేఖ ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పంపారు? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో రాజాసింగ్ నివాసం, ఆయన వెళ్లే ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేసే అవకాశం ఉంది.

------

# వైష్ణవి హత్య కేసులో రిమాండ్‌కు హరిబాబు



**జగిత్యాల,మార్చి 18ప్రజావినికిడి** జగిత్యాల జిల్లాలో సంచలనం సృష్టించిన యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో తాజా పరిణామాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉంటూ అందరినీ అలరించిన ఓ యువతి, అదనపు కట్నం వేధింపులకు బలి కావడం అత్యంత విచారకరం. ఈ కేసులో పోలీసులు వేగంగా స్పందించి నిందితుడిని పట్టుకున్నారు. నిందితుడు హరిబాబు, వైష్ణవిని అదనపు కట్నం కోసమే హత్య చేసినట్లు పోలీసుల విచారణలో అంగీకరించాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ హత్య కేవలం హరిబాబు ఒక్కడే చేశాడా..? లేదా కుటుంబ సభ్యుల ప్రోద్బలం ఏమైనా ఉందా? అనే కోణంలో పోలీసులు సమగ్రంగా విచారిస్తున్నారు. ఘటనా స్థలంలో లభించిన క్లూస్, ఫోరెన్సిక్ ఆధారాలు ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించనున్నాయి. వరకట్న వేధింపులు లాంటి కేసుల్లో నిందితులకు కఠినమైన శిక్ష పడితేనే, భవిష్యత్తులో ఇటువంటి అకృత్యాలను అరికట్టే అవకాశం ఉంటుందని పలువురు చెబుతున్నారు.

# దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం

**దివ్యాంగ శక్తి పథకం ప్రారంభంచిన సిఎం -12.75 లక్షల మందికి లబ్ది చేకూరుతుందని వెల్లడి**






**అమరావతిమార్చి 18ప్రజావినికిడి**
దివ్యాంగ శక్తి పథకం ద్వారా లక్షల మందికి మేలు జరుగుతోందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. దివ్యాంగుల గౌరవాన్ని పెంచేందుకు ఈ పథకం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం దివ్యాంగ శక్తి పథకాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం దివ్యాంగులతో కలిసి చంద్రబాబు, మంత్రి లోకేశ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగ శక్తి పథకంపై లబ్దిదారులతో సీఎం మాట్లాడారు. ప్రజాసంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. ఇవాళ ప్రారంభించిన ఈ దివ్యాంగ శక్తి పథకం తనకు ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పుకొచ్చారు. తాను, పవన్ కల్యాణ్, లోకేశ్ కలిసి ఈ పథకాన్ని ప్రారంభించి దివ్యాంగులతో ప్రయాణించటం ఆనందంగా ఉందని చంద్రబాబు అన్నారు. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యను అధిగమించి విజయాలు సాధించే శక్తి ఉన్న వారని తెలిపారు. గతంలో 'చేయూత' కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు సహాయం చేశామని ప్రస్తావించారు. ట్రైసైకిళ్లతో పాటు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసం నింపడానికి టూ వీలర్లను అందించామని గుర్తుచేశారు. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి ఇస్తున్నామని స్పష్టం చేశారు. తీవ్ర ఆరోగ్య ఇబ్బందుల్లో ఉండే దివ్యాంగులకు రూ.10 వేలు, మంచానికి పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది పింఛన్ల కోసం రూ.33 వేల కోట్లు ఖర్చుచేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో ఇప్పుడు ఏపీఎస్ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎలాంటి ఛార్జీలు లేకుండా ఐదు రకాల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. ఈ సౌకర్యం ద్వారా నెలకు ఒక్కొక్కరికీ రూ.2 వేల దాకా దివ్యాంగులకు ఆదా అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. మొదటి నుంచి దివ్యాంగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. దివ్యాంగ శక్తి పథకంతో ఈ ఉగాది మరింత ఆనందంగా చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమేనని చెప్పుకొచ్చారు. దివ్యాంగులకు అండగా నిలబడాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళల స్త్రీ శక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 52 కోట్ల ప్రయాణాలు జరిగాయని ప్రస్తావించారు. దివ్యాంగ సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మందకృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరావులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు

**త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు**


**సిబ్బంది నియామకం పనులు పూర్తి**

**రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి**



న్యూఢిల్లీ,**మార్చి 18ప్రజావినికిడి** ,త్వరలో విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌పై ఆయన పార్లమెంట్‌లో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకాలు పూర్తయ్యాయని వెల్లడించారు. జోన్ ప్రధాన కార్యాలయ భవనం పునాది పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఎర్రుపాలెం–అమరావతి–నంబూరు లైన్‌కు రూ.2,047 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఏపీలో రూ.70,232 కోట్లతో రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయని వివరించారు. జోన్ కార్యకలాపాలు ప్రారంభించేందుకు విఎంఆర్‌డిఎ భవనం 'ది డెక్' సిద్ధమైందని అన్నారు. త్వరలోనే అక్కడి నుంచే పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. రైల్వేజోన్ కోసం జనరల్ మేనేజర్, ఇతర ఉన్నతాధికారుల నియామకం పూర్తి చేస్తామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 2009–2014 మధ్య సగటున రూ. 886 కోట్లు ఉంటే, 2025– 26లో ఆంధ్రప్రదేశ్‌కు రికార్డు స్థాయిలో రూ.9,417 కోట్ల కేటాయింపులు జరిగాయని స్పష్టం చేశారు. గతంతో పోలిస్తే రైల్వేట్రాక్ నిర్మాణ వేగం రెట్టింపు అయిందని వివరించారు. ప్రతి ఏటా సగటున 143 కిలోమీటర్ల మేర కొత్త ట్రాక్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎర్రుపాలెం – అమరావతి – నంబూరు కొత్త రైల్వేలైన్ (57 కిలోమీటర్ల) కోసం రూ. 2047 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఏపీలో ప్రస్తుతం రూ. 70,232 కోట్ల విలువైన 39 రైల్వే ప్రాజెక్టులు (కొత్త లైన్లు, డబ్లింగ్) పనులు కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. విజయవాడ – గూడూరు మూడవ రైల్వేలైన్, గుంతకల్ – గుంటూరు డబ్లింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వివరించారు.

# సన్‌రైజర్స్ కొత్త కెప్టెన్‌గా ఇషాన్ కిషన్



2026 ఐపీఎల్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంఛైజీ కీలక ప్రకటన చేసింది. గాయం కారణంగా తమ రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ లీగ్‌లో ప్రారంభ మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. దీంతో జట్టుకు కొత్త కెప్టెన్‌ను అనౌన్స్ చేసింది. యంగ్ టాలెంటెడ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ తమ కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఇక మరో డాషింగ్ బ్యాటర్ అభిషేక్ శర్మను వైస్‌కెప్టెన్‌గా ప్రమోట్ చేసింది. కమిన్స్ గైర్హాజరీలో ఈ ఇద్దరూ జట్టును నడిపించనున్నారు. అయితే కమిన్స్ గాయం నుంచి పూర్తిగా కోలుకొని వచ్చిన తర్వాత మళ్లీ అతడికే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగిస్తారు. ఈ మేరకు స్పష్టతనిస్తూ సన్‌రైజర్స్ సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసిది. కాగా, ఈ కొత్త ఎడిషన్ సన్‌రైజర్స్ మ్యాచ్‌తోనే ప్రారంభం కానుంది. మార్చి 28న సన్‌రైజర్స్- ఆర్సీబీ బెంగళూరు చిన్నస్వామి వేదికగా తలపడనున్నాయి. అయితే కొన్ని నెలలుగా కమిన్స్ వెన్ను నొప్పితో ఆటకు దూరమయ్యాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే వైదొలిగాడు. ఈ సిరీస్‌లో ఒకే ఒక్క టెస్టు మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత టీ20 వరల్డ్‌కప్ టోర్నమెంట్‌కు సైతం కమిన్స్ దూరంగా ఉన్నాడు. అయితే ఐపీఎల్ ప్రారంభం నాటికి కోలుకుంటాడని ముందుగా భావించారు. కానీ, కమిన్స్ ఫుల్ ఫిట్‌గా వచ్చేందుక ఇంకాస్త సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సన్‌రైజర్స్ ఈ ప్రకటన చేసింది. అయితే కమిన్స్ నాయకత్వంలో సన్‌రైజర్స్ బలమైన జట్టుగా తయారైంది. దూకుడుగా ఆడుతూ ప్రత్యర్థులకు వణుకు పుట్టించింది. జట్టులోని ఆటగాళ్లంతా అగ్రెసివ్ అప్రోచ్‌తో తొలి బంతి నుంచే బౌండరీలు బాదడం అలవాటుగా మార్చుకున్నారు. ఫలితంగా ఐపీఎల్ చరిత్రలో అత్యధిక స్కోర్లు బాదిన జాబితాలో తొలి నాలుగు స్థానాలు సన్‌రైజర్స్ పేరిటే నిలిపారు. 2024లో ఆర్సీబీపై 20ఓవర్లలో సన్‌రైజర్స్ 287-3 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఐపీఎల్‌లో ఓ జట్టు చేసిన అత్యధిక స్కోర్ ఇదే. ఆ తర్వాత 286-6 (2025లో), 278-3 (2025లో), 277-3 (2024లో) వరుస స్థానాలు సన్‌రైజర్స్‌వే కావడం విశేషం. ఇక కమిన్స్ రాక ఆలస్యం కానుండడంతో ఓపెనర్లు ఇషాన్- అభిషేక్‌కు ప్రమోషన్ దక్కినట్లైంది. అయితే ప్రస్తుతం ఇషాన్ వయసు 27ఏళ్లు. దీంతో ఈ నిర్ణయం తాత్కాలికంగానే కాకుండా దీర్ఘకాల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని చేసి ఉండవచ్చు. ప్రస్తుతం కమిన్స్ వయసు 32ఏళ్లు. అంటే ఇంకో రెండు లేదా మూడేళ్లు అతడు జట్టులో ఆడే అవకాశం ఉంది. అందుకే కమిన్స్ వారసుడిగా ఇషాన్‌కు ఎంపిక చేసినట్లు అనిపిస్తుంది. దీంతో మున్ముందు ఇషాన్‌కే పూర్తిగా జట్టు బాధ్యతలు ఇవ్వడం ఖాయంగా కనిపిస్తుంది.వాస్తవానికి జట్టును నడిపించడం ఇషాన్‌కు కొత్తేం కాదు. అతడు గతేడాది దేశవాళీ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీలో ఝార్ఖండ్ జట్టుకు నాయకత్వం వహించాడు. ఆ టోర్నీలో తన బ్యాటింగ్‌తోపాటుగా కెప్టెన్సీ స్కిల్స్‌తో ఆకట్టుకున్నాడు. ఏకంగా జట్టును ఛాంపియన్‌గా నిలిపాడు. ఇప్పుడు అదే అనుభవంతో ఐపీఎల్‌లోనూ సన్‌రైజర్స్‌ను ముందుకు నడిపించేందుకు సిద్ధమవుతున్నాడు.

సన్‌రైజర్స్ జట్టు 2026 : అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, బ్రైడన్ కార్సే, ఎషాన్ మలింగ, హర్ష్ దూబే, హర్షల్ పటేల్, హెన్రిచ్ క్లాసెన్, ఇషాన్ కిషన్, జయదేవ్ ఉనద్కత్, కమిందు మెండిస్, నితీష్ కుమార్ రెడ్డి, పాట్ కమిన్స్, స్మరణ్ రవిచంద్రన్, ట్రావిస్ హెడ్, సల్షన్ అన్రో, లియామ్ లివింగ్‌స్టోన్ , జాక్ ఎడ్వర్డ్స్, అమిత్ కుమార్, క్రెయిన్స్ ఫులేట్రా, షకిబ్ హుస్సేన్, ఓంకార్ తర్మలే, ప్రఫుల్ హింగే, శివమ్ మావి



# హోం గ్రౌండ్‌లో ఆడనున్న ఆర్సీబీ

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్యాన్స్‌కు శుభవార్త. ఈ ఏడాది మార్చి 28న ప్రారంభం కానున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో ఆర్సీబీ తమ మ్యాచ్‌లను చిన్నస్వామి స్టేడియంలో ఆడేందుకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ప్రభుత్వం మార్చి 16న అధికారిక ప్రకటన చేసింది. మ్యాచ్‌ల నిర్వహణపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికపై సోమవారం విధానసౌధలో హౌం మంత్రి పరమేశ్వర అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో చిన్నస్వామిలో తమ సొంత అభిమానుల మధ్య ఆడేందుకు ఆర్సీబీకి లైన్ క్లియర్ అయ్యింది. ఈ సీజన్‌లో చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ 5 మ్యాచ్‌లు ఆడనుంది. ఇక ఈ ఏడాది తొలి మ్యాచ్‌లో ఆర్సీబీ- సన్‌రైజర్స్ పోటీపడనున్నాయి. ఈ మ్యాచ్‌కు చిన్నస్వామి స్టేడియం వేదిక కానుంది. కాగా, గతేడాది జూన్ 04న ఆర్సీబీ విజయోత్సవ సంబరాల్లో ఇదే స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడ్డారు. దీంతో అప్పట్నుంచి భారీ ఈవెంట్లు నిర్వహించేందుకు చిన్నస్వామి స్టేడియం సురక్షితం కాదని అందులో మ్యాచ్‌లు బ్యాన్ చేశారు. తాజాగా నిపుణుల నివేదికతో మళ్లీ అనుమతి వచ్చింది. ఈ ఫ్రాంచైజీ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా తమ రెండవ హోమ్‌గా పరిగణిస్తుంది. ఇక్కడ ఆర్సీబీ రెండు లీగ్ మ్యాచ్‌లు ఆడనుంది. వీటితో పాటు, ఒక ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్ అలాగే ఫైనల్స్ కూడా బెంగళూరులో జరగనున్నాయి.

# లైఫ్ పార్ట్‌నర్ కోరుకునేది భర్త ఎదుగుదలే



టీమ్‌ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఇటీవలే దేశానికి పొట్టి ప్రపంచకప్‌ను అందించాడు. మార్చి 28 నుంచి జరగబోయే ఐపీఎల్ కోసం సన్నద్ధమవుతున్నాడు. ఈ క్రమంలో పీటీఐ వీడియోస్ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్నాడు. అందులో తన క్రికెట్ కెరీర్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. అలాగే తన భార్య దేవిషా తన క్రికెట్ కెరీర్ గమనాన్ని మార్చేసిందని చెప్పుకొచ్చాడు. జాతీయ జట్టుకు ఎంపికయ్యేలా తనను తీవ్రంగా శ్రమించేలా పురిగొల్పింది కూడా దేవిషాయేనని వెల్లడించాడు. తాను ప్రస్తుతం ఇంతటి స్థాయిలో ఉండడానికి కూడా ఆమే కారణమని ప్రశంసించాడు. తన భార్య దేవిషాను ఎంత పొగిడినా తక్కువేనని అభిప్రాయపడ్డాడు. సూర్యకుమార్ యాదవ్ తన భార్య దేవిషాతో జరిగిన ఆసక్తికర చర్చ గురించి వివరించాడు. "2016లో దేవిషాతో నాకు పెళ్లైంది. అప్పుడు నేనే ఐపీఎల్‌లో కేకేఆర్ తరఫున ఆడుతున్నాను. గేమ్‌ను ఆస్వాదిస్తున్నాను. అంతా సజావుగా సాగుతోంది. అయితే నేను 2018లో ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీకి మారేంత వరకు దేవిషా నా కెరీర్‌ను, దినచర్యను గమనిస్తూ వచ్చింది. అప్పుడు నాకు ఒక ప్రశ్న వేసింది. 'ఐపీఎల్‌లో నీతోపాటు ఆడే నీ వయసు వాళ్లలో చాలామంది ఇప్పుడు భారత్ తరఫున ఆడుతున్నారు. నీ మనసులో ఏముంది' అని దేవిషా ప్రశ్నించింది. అప్పుడు నేను 'నాకు కూడా టీమ్‌ఇండియా తరఫున ఆడాలని ఉంది' అని చెప్పాను. 'ఎలా ఆడుతావు' అని దేవిషా నన్ను అడిగింది" అని భారత జట్టు టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. నా భార్య దేవిషాతో ఒక చక్కని సంభాషణ జరిగింది. వాదనేం కాదు. కేవలం చర్చ మాత్రమే. అప్పుడు నేను భారత్ తరఫున ఆడాలనుకుంటే ఏం చేయాలని ఆలోచించాను. అది ఎలా అని ఆలోచించుకున్నాను. డైట్, ఫ్రెండ్స్‌తో వీకెండ్స్, శని-ఆదివారాలు విశ్రాంతి, సోమవారం నుంచి శుక్రవారం వరకు పని వంటి చాలా విషయాలలో రాజీ పడ్డాను. 2018లో నేను ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ తరఫున (512 పరుగులు) చేశాను. అలాగే దేశీయ క్రికెట్‌లో కూడా రాణించాను. ఆ తర్వాతి 2019, 2020లో కూడా ముంబయి తరఫున ఓపెనింగ్ చేశాను.

# ముంబై ఇండియన్స్ ఆటతీరును మార్చుకో బోతోంది

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో ఛాంపియన్లకే ఛాంపియన్ ముంబై ఇండియన్స్... చెన్నై సూపర్ కింగ్స్ తర్వాత ముంబై ఇండియన్స్ ఛాంపియన్ గా అవతరించింది. ఎన్నో విజయాలు సాధించింది... అడపాదడపా ఓటములతో అనుభవాలను నేర్చుకున్న ముంబై ఇండియన్స్ గత రెండు సీజన్లలో పేలవ ప్రదర్శనతో వెనుకబడింది. లోటుపాట్లను సరిదిద్దుకున్న ముంబై ఇండియన్స్... ఐపీఎల్ 2026 సీజన్ లో సత్తా చాటాలని ఎదురు చూస్తోంది. ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడి భారీ స్కోర్లను సాధించాలనే లక్ష్యంతో జట్టును పటిష్టం చేసింది. అన్ని విభాగాల్లోనూ ప్రతిభావంతులతో టీమ్ ను తీర్చిదిద్దింది. ముంబై ఇండియన్స్ కెప్టెన్ గా సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన రోహిత్ శర్మ... హార్థిక్ పాండ్యాకు బాధ్యతలు అప్పగించారు. విజయాలకు మారుపేరుగా ఉన్న ముంబై ఇండియన్స్... ఇపుడు పరాజయాల పరంపరను కొనసాగిస్తోంది. 2026 సీజన్ ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముంబై ఇండియన్స్... భారీ స్కోర్లను సాధించే దిశగా వ్యూహరచన చేస్తోంది. వేదిక ఏదైనా... ప్రత్యర్థి జట్టుతో పోటీపడి ఘన విజయాలను సొంతం చేసుకోడానికి సిద్ధమైంది. క్రీజులో నిలబడితే చాలు... హార్డ్ హిట్లతో స్కోరు బోర్డు అమాంతంగా పరుగులు పెట్టే విధంగా ముంబై ఇండియన్స్ ఆట సాగబోతోంది. టీ20 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టన్, డాషింగ్ బ్యాట్స్ మెన్ సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. టీమిండియాకు కెప్టెన్ గా ఉన్న సూర్యకుమార్ యాదవ్, ముంబై ఇండియన్స్ లో సాధారణ ఆటగాడిగా కొనసాగుతారా హార్థిక్ పాండ్యా నుంచి బాధ్యతలను సూర్యకుమార్ కు బదలాయిస్తారా అనే ప్రశ్నలు చర్చనీయాంశంగా మారాయి. ముంబై ఇండియన్స్ తరఫు రోహిత్ శర్మతోపాటు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ గా జతకట్టేది ఎవరు క్రికెట్ అభిమానుల్లో ప్రశ్నలు తలెత్తున్నాయి. దక్షిణాఫ్రికా క్రికెటర్, కెప్టన్ గా ప్రాతినిధ్యం వహించిన క్వింటన్ డీకాక్, విల్ జాక్స్ ఇద్దరిలో ఒకరు ఓపెనింగ్ బ్యాట్స్ మెన్ గా దిగే అవకాశాలున్నాయి. తాజా సీజన్ లో ముంబై ఇండియన్స్ బ్యాటింగ్ బలం కీ రోల్ పోషించబోతోంది. ఓపెనర్లు పరుగుల వరద పారించే విధానాన్ని టాప్ ఆర్డర్ బ్యాట్స్ మెన్ అనుసరించే విధంగా ఆటగాళ్లను బరిలోకి దింపుతున్నారు.



# వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్ల సత్తా

ఐసీసీ తాజాగా ప్రకటించిన వన్డే ర్యాంకింగ్స్‌లో భారత క్రికెటర్లు తమ సత్తా చాటారు. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టీమిండియా ప్లేయర్లు టాప్-5లో ఏకంగా మూడు స్థానాలను కైవసం చేసుకోవడం విశేషం. ఐసీసీ విడుదల చేసిన తాజా వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో న్యూజిలాండ్ స్టార్ బ్యాటర్ డారిల్ మిచెల్ అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా.. భారత రన్ మెషీన్ విరాట్ కోహ్లీ రెండో స్థానంలో నిలిచి తన ఫామ్‌ను చాటుకున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ఇబ్రాహీం జద్రాన్ మూడో స్థానంలో ఉండగా.. భారత కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో స్థానంలో, యువ సంచలనం శుభ్‌మన్ గిల్ ఐదో స్థానంలో నిలిచారు. ప్రపంచంలోని టాప్-5 బ్యాటర్లలో ముగ్గురు భారతీయులే ఉండటం టీమిండియా బ్యాటింగ్ పటిష్టతకు నిదర్శనం.బౌలింగ్ విభాగంలో ఆఫ్ఘనిస్తాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్ నంబర్ 1 స్థానాన్ని దక్కించుకున్నారు. ఇంగ్లాండ్ పేసర్ జోఫ్రా ఆర్చర్, దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఆశ్చర్యకరంగా నమీబియాకు చెందిన బెర్నార్డ్ స్కోల్జ్ నాలుగో స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో కూడా ఆఫ్ఘనిస్తాన్ ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. అజ్మతుల్లా ఒమర్జాయ్ మొదటి స్థానంలో ఉండగా,..సికందర్ రజా (జింబాబ్వే), మహ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్) టాప్-3లో నిలిచారు.మహిళల వన్డే క్రికెట్‌లోనూ భారత్ తన జెండాను ఎగురవేసింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతూ దేశానికి గర్వకారణంగా నిలిచింది.

# వైభవ్ గేమ్‌ప్లాన్ రివీల్ చేసిన శాంసన్




2026 ఐపీఎల్ ప్రారంభానికి రోజులు దగ్గరపడుతున్నాయి. ఇదే నెల 28న కొత్త సీజన్ గ్రాండ్‌గా షురూ కానుంది. ఈ క్రమంలో మరోసారి అందరి చూపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపైనే నెలకొంది. గతేడాది ఐపీఎల్‌లో అరంగేట్రం చేసి విధ్వంసం సృష్టించిన ఈ చిచ్చరపిడుగుపై ఈసారి భారీగా అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో వైభవ్ గురించి శాంసన్ ఓ ఆసక్తికర విషయం బయట పెట్టాడు. మార్చి 15న బీసీసీఐ దిల్లీ వేదికగా నమన్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించింది. ఈ ఈవెంట్‌లో ఇటీవల వరల్డ్‌కప్ సాధించిన మహిళల, పురుషుల జట్లను సన్మానించారు. వైభవ్ సూర్యవంశీ కూడా ఈ కార్యక్రమానికి వచ్చాడు. అతడు తన సీనియర్లు హార్దిక్ పాండ్య, అభిషేక్ శర్మ, సంజు శాంసన్‌తో కలిసి క్వశ్చన్ సెషన్‌లో పాల్గొన్నాడు. అందులో వైభవ్‌కు హోస్ట్ ఆసక్తికర ప్రశ్నలు అడిగాడు. ఐపీఎల్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతి ఎక్కడికి వెళ్లింది అని అడగ్గా, 'లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై డెబ్యూ మ్యాచ్ ఆడాను. ఆ మ్యాచ్‌లో నేను ఎదుర్కొన్న తొలి బంతినే కవర్స్ మీదుగా సిక్స్ కొట్టాను' అని వైభవ్ రిప్లై ఇచ్చాడు. 'అయితే మీ కోచ్ ఇక్కడే ఉన్నాడు (రాహుల్ ద్రవిడ్‌ను ఉద్దేశిస్తూ). ఆయన టెస్టుల్లో ఓపిగ్గా ఆడుతూ రెండు రోజులు కూడా బ్యాటింగ్ చేయగలడు. అలాంటిది నువ్వు తొలి బంతినే సిక్స్ కొడతానని చెప్పినప్పుడు ఆయన రియాక్షన్ ఏంటి' అని అడిగాడు. దీనికి వైభవ్ సమాధానం చెబుతుండగా, అక్కడే ఉన్న శాంసన్ మధ్యలో కల్పించుకొని వివరంగా చెప్పాడు.

"లఖ్‌నవూతో మ్యాచ్ ముందు రోజు ద్రవిడ్ సర్ నన్ను, వైభవ్‌ను రూమ్‌కు పిలిచాడు. 'వైభవ్ చాలా చిన్నపిల్లవాడు. ఎలా ఆడాలి ఎలా ముందుకెళ్లాలో మనం అతడికి చెప్పాలి' అని సర్ అన్నాడు. వెంటనే 'వైభవ్ నీ గేమ్ ప్లాన్ ఏంటి' అని రాహుల్ సర్ అతడిని అడిగాడు. దీనికి అతడు 'ప్లాన్ అంటూ ఏమీ లేదు సర్, అవకాశం వస్తే తొలి బంతినే గాల్లోకి లేపేయడమే' అని చెప్పాడు. అతడు వీడియో గేమ్ ఆడుతున్నాడా ఏంటి అని నేను అప్పుడే అనుకున్నా" అని శాంసన్ నవ్వుతూ వైభవ్ అరంగేట్రం కంటే ముందు జరిగిన సంభాషణను షేర్ చేసుకున్నారు.

ఆ సంభాషణలో చెప్పినట్లే వైభవ్ ఆ మ్యాచ్‌లో తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచాడు. కాగా, గతేడాది లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌తో వైభవ్ ఐపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఈ మ్యాచ్‌లో ఓపెనర్‌గా బ్యాటింగ్‌కు దిగిన వైభవ్ తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్స్‌గా మలిచి ఔరా అనిపించాడు.

# 'ఉస్తాద్'కి హైలైట్ గా నిలిచే విలనిజం!

'ఉస్తాద్ భగత్ సింగ్' .. మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై ఒక రేంజ్ లో అంచనాలు ఉన్నాయి. అడ్వాన్స్ బుకింగ్స్ దగ్గర నుంచి ప్రతి విషయంలోను ఈ సినిమా కొత్త రికార్డులను సృష్టించడం ఖాయమనే అభిప్రాయంతో అభిమానులు ఉన్నారు. శ్రీలీల – రాశీ ఖన్నా కథానాయికలుగా నటించిన ఈ సినిమాలో, ప్రతినాయకుడిగా పార్తీబన్ కనిపించనున్నాడు. కోలీవుడ్ సీనియర్ స్టార్ హీరోలు, కొంతకాలంగా తెలుగులో విలన్ రోల్స్ చేస్తూ వెళుతున్నారు. పవర్ఫుల్ విలన్ గా తెలుగు తెరపై కనిపించడానికి వాళ్లు ఎంతమాత్రం వెనకాడటం లేదు. ఆ జాబితాలో అర్జున్ .. అరవింద్ స్వామి .. విజయ్ సేతుపతి వంటి స్టార్స్ కనిపిస్తున్నారు. తాజాగా ఆ వరుసలోకి పార్తీబన్ చేరిపోయాడు. తమిళంలో సీనియర్ హీరోగా .. దర్శక నిర్మాతగా పార్తీబన్ కి మంచి ఇమేజ్ ఉన్న సంగతి తెలిసిందే. ఈ జనరేషన్ తెలుగు ఆడియన్స్ కి పార్తీబన్ అంతగా తెలియదు. ఎందుకంటే నేరుగా ఆయన తెలుగులో చేసిన సినిమాలు చాలా తక్కువ. తమిళ సినిమాల అనువాదాలు ద్వారానే ఆయన ఇక్కడి ఆడియన్స్ కి తెలుసు. అలాంటి పార్తీబన్ ఈ సినిమాలో పవర్ఫుల్ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. ఆయన పాత్రను హరీశ్ శంకర్ చాలా డిఫరెంట్ గా డిజైన్ చేశాడట. ఈ పాత్ర ఈ సినిమా హైలైట్స్ లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. విలక్షణమైన విలనిజంతో పార్తీబన్ ఏ రేంజ్ లో మెప్పిస్తాడో చూడాలి మరి.





# హీరోల ఆలోచనా విధానంపై తాప్సీ విమర్శలు

బాలీవుడ్ 'ఫైర్ బ్రాండ్' తాప్సీ పన్ను తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు సినీ పరిశ్రమలో మరోసారి ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా అగ్ర హీరోల అభద్రతా భావం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్గా మారాయి.తాప్సీ తన తాజా ఇంటర్వ్యూలో హీరోల ఆలోచనా విధానాన్ని ఎండగట్టింది. కథానాయికలకు ప్రాధాన్యత ఉన్న సినిమాల్లో నటించడానికి చాలా మంది స్టార్ హీరోలు సిద్ధంగా లేరని ఆమె విమర్శించింది. ఈ సందర్భంగా తనకు ఎదురైన ఒక చేదు అనుభవాన్ని తాప్సీ పంచుకుంది."ఒక సినిమాలో నేను డబుల్ రోల్ చేస్తున్నప్పుడు, సదరు హీరో ఆ ప్రాజెక్ట్ను రిజెక్ట్ చేశాడు. దానికి ఆయన చెప్పిన కారణం ఏంటంటే.. సినిమాలో హీరోయిన్ పాత్రకు ఎక్కువ నిడివి, ప్రాధాన్యత ఉంటే చివరకు ప్రేక్షకుల సానుభూతి, ప్రశంసలు ఆమెకే దక్కుతాయని ఆయన భయపడ్డాడు. అంతకుముందే ఆ హీరోతో తాను కలిసి పనిచేసినప్పటికీ... కేవలం తన పాత్రకు ప్రాధాన్యత ఎక్కువగా ఉందనే అభద్రతా భావంతో ఆయన వెనక్కి తగ్గడం నన్ను ఆశ్చర్యపరిచింది" అని తాప్సీ వెల్లడించింది.కేవలం సీనియర్ హీరోలే కాదు, ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువ హీరోలు కూడా హీరో పాత్ర నిడివి తక్కువగా ఉంటే అటువంటి సినిమాలకు దూరంగా ఉంటున్నారని ఆమె విమర్శించింది. హీరోయిన్ డామినేట్ చేస్తుందనే భయంతో మంచి కథలను వదులుకోవడం వల్ల చిత్ర పరిశ్రమలో సమానత్వం అనేది ప్రశ్నార్థకంగా మారుతోందని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం తాప్సీ వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# రాజకీయాల్లోకి రావడంపై క్లారిటీ ఇచ్చిన నారా రోహిత్


టాలీవుడ్ నటుడు నారా రోహిత్ తన రాజకీయ రంగప్రవేశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టతనిచ్చారు.ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడి కుమారుడిగా, లోకేశ్ కు సోదరుడిగా రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ... రోహిత్ ఇప్పటి వరకు సినిమాలకే పరిమితమయ్యారు. తాజాగా ఆయన మాట్లాడుతూ, "కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాను. కానీ దానికి ఇంకా సమయం ఉంది. సరైన సమయంలో నా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తాను" అని తెలిపారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించడమే తన మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు.



# ఆల్-టైమ్ రికార్డులపై కన్నేసిన 'ధురంధర్ 2'

రణ్వీర్ సింగ్ హీరోగా, ఆదిత్య ధర్ దర్శకత్వంలో రాబోతున్న 'ధురంధర్ 2' చిత్రం విడుదలకు ముందే బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. ఈ సినిమాపై ప్రేక్షకుల్లో కనిపిస్తున్న అసాధారణమైన క్రేజ్, అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో రికార్డులు సృష్టిస్తోంది. ఈ ప్రభంజనం ఎంతలా ఉందంటే, ముంబైలోని ఐకానిక్ థియేటర్ మరాఠా మందిర్లో దశాబ్దాలుగా ప్రదర్శితమవుతున్న షారుఖ్ ఖాన్ 'దిల్వాలే దుల్హనియా లేజాయేంగే' (డీడీఎల్జే) షో సమయాన్ని కూడా మార్చాల్సి వచ్చింది.'ధురంధర్ 2' నిడివి దాదాపు 3 గంటల 55 నిమిషాలు ఉండటంతో థియేటర్లు షోలను సర్దుబాటు చేయడంలో తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇందులో భాగంగా ఇవాళ్టి నుంచి మరాఠా మందిర్లో డీడీఎల్జే ప్రదర్శనను ఉదయం 10 గంటలకు మార్చారు. గత మూడు దశాబ్దాలుగా ప్రతిరోజూ ఉదయం 11:30 గంటలకు ప్రదర్శించబడుతూ వస్తోంది. దశాబ్దాల చరిత్రలో డీడీఎల్జే షో సమయం ఇలా మారడం ఇదే తొలిసారి. ఈ థియేటర్లో 'ధురంధర్ 2' ను మధ్యాహ్నం 1:15, సాయంత్రం 5:30, రాత్రి 9:45 గంటలకు ప్రదర్శించనున్నారు. దేశవ్యాప్తంగా పలు థియేటర్లు అర్ధరాత్రి, తెల్లవారుజామున కూడా ప్రత్యేక షోలను ప్లాన్ చేస్తున్నాయి. గతంలో 'పుష్ప 2', 'యానిమల్' వంటి భారీ చిత్రాలకు ఇలాంటి మార్పులు జరిగినప్పటికీ, ఒక హిందీ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ దశలోనే ఈ స్థాయిలో ఏర్పాట్లు జరగడం ఇదే మొదటిసారి.ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆల్-టైమ్ రికార్డులపై కన్నేసింది. అడ్వాన్స్ బుకింగ్స్ సరళిని గమనిస్తే, తొలిరోజు వసూళ్లలో షారుఖ్ ఖాన్ 'జవాన్' రికార్డును 'ధూరందర్ 2' అధిగమించేలా కనిపిస్తోంది. 'జవాన్' తొలిరోజు హిందీలో రూ. 65.50 కోట్లు, దేశవ్యాప్తంగా రూ. 75 కోట్లు వసూలు చేసింది. ఇప్పటికే 'ధురంధర్ 2' అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా రూ. 30.31 కోట్లు రాబట్టింది. 'జవాన్' రికార్డును అందుకోవాలంటే మరో రూ. 35 కోట్ల వరకు అవసరం.అయితే, హిందీ చిత్ర పరిశ్రమలో ఆల్-టైమ్ హైయెస్ట్ ఓపెనర్ రికార్డు ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2' పేరిట ఉంది. ఈ చిత్రం తొలిరోజు హిందీలో రూ. 72 కోట్లు, పాన్-ఇండియా స్థాయిలో రూ. 164.25 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడు 'ధురంధర్ 2' ఈ భారీ రికార్డును సవాలు చేస్తుందో లేదోనని సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. మొత్తానికి విడుదలకు ముందే 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద పెను తుపానుకు సంకేతాలు పంపుతోంది.




# 'పెద్ది' సెట్స్‌లో క్రికెటర్ తిలక్ వర్మ..


మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, సంచలన దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'పెద్ది'. గ్రామీణ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా సెట్స్‌లో తాజాగా టీమిండియా యువ క్రికెటర్ తిలక్ వర్మ సందడి చేశాడు. ఈ అనూహ్య పరిణామం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ఈ విషయాన్ని దర్శకుడు బుచ్చిబాబు సానా స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. రామ్ చరణ్, తిలక్ వర్మ కలుసుకున్న వీడియోను పంచుకుంటూ... "టీ20 ప్రపంచకప్ ఛాంపియన్ తిలక్ వర్మ 'పెద్ది' సెట్స్‌ను సందర్శించారు. సినిమాలోని కొన్ని క్రీడా నేపథ్య సన్నివేశాలను చూసి ఆయన చాలా ఇంప్రెస్ అయ్యారు" అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌తో పాటు సినిమాను ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మరోసారి ధ్రువీకరించారు.సెట్స్‌లో జరిగిన ఈ భేటీలో తిలక్ వర్మ సినిమాలోని కొన్ని కీలక స్పోర్ట్స్ సీక్వెన్స్ ఫుటేజ్‌ను వీక్షించినట్లు సమాచారం. కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా ఆ సన్నివేశాల్లోని భావోద్వేగాలను చూసి ఆయన చాలా బాగున్నాయని ప్రశంసించినట్లు చిత్రవర్గాలు తెలిపాయి. తిలక్ వర్మ లాంటి ఒక ప్రొఫెషనల్ క్రీడాకారుడి నుంచి వచ్చిన ఈ ప్రశంస, తాము తీస్తున్న సన్నివేశాలు ఎంతో వాస్తవికంగా, ఉద్వేగభరితంగా ఉన్నాయనే నమ్మకాన్ని చిత్ర బృందంలో మరింత పెంచిందని తెలుస్తోంది.

ఈ సందర్భంగా రామ్ చరణ్, తిలక్ వర్మను ప్రత్యేకంగా అభినందించి, తన ఆటోగ్రాఫ్‌తో కూడిన 'పెద్ది' సినిమా బ్యాట్‌ను బహుమతిగా అందించారు. అనంతరం తిలక్ వర్మ చిత్ర యూనిట్‌ను ఉద్దేశించి తెలుగులో మాట్లాడటం అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్, అవినాశ్ కొల్లా ప్రొడక్షన్ డిజైన్ వంటి స్పెషలిస్టుల సాంకేతిక నిపుణుల పనితనం సినిమా స్థాయిని పెంచుతోంది.




# 'ఉస్తాద్' ఉప్పెనలా పాత రికార్డులు తుడిచేస్తాడంటున్న ఫ్యాన్స్!

పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అంతా ఇప్పుడు 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా కోసం వేయికళ్లతో వెయిట్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ వారు భారీ బడ్జెట్ తో నిర్మించిన ఈ సినిమా, టైటిల్ దగ్గర నుంచే అంచనాలను పెంచడం మొదలుపెట్టింది. ఇక పోస్టర్స్ దగ్గర నుంచే అందరిలోను ఆసక్తిని పెంచుతూ వెళ్లింది. పవన్ కల్యాణ్ కి ఉన్న మాస్ ఇమేజ్ కీ .. ఆయన బాడీ లాంగ్వేజ్ కి సరిగ్గా సరిపోయే కంటెంట్ అనేది అభిమానులకు అర్థమైపోయింది. ఈ సినిమాకి దర్శకుడు హరీశ్ శంకర్ కావడం ఇక్కడ మరో విశేషం. హరీశ్ శంకర్ కి మాస్ ఆడియన్స్ పల్స్ తెలుసు. పవన్ సినిమా నుంచి ఫ్యాన్స్ ఏం కోరుకుంటున్నారనేది ఆయనకి తెలుసునని అనడానికి 'గబ్బర్ సింగ్' సినిమాను ఒక ఉదాహరణగా తీసుకోవచ్చు. దేవిశ్రీ బాణీలు .. తమన్ నేపథ్య సంగీతం ఈ సినిమాకి ప్రధానమైన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ సినిమా అడ్వాన్స్ బుకింగ్స్ జోరు చూస్తేనే, ఏ స్థాయిలో ఆడియన్స్ ఉత్సాహాన్ని చూపిస్తున్నారనేది అర్థమైపోతుంది. పవన్ కల్యాణ్ జోడీగా శ్రీలీల తొలిసారిగా చేసిన సినిమా ఇది. నటన పరంగా .. డాన్స్ పరంగా శ్రీలీలకి వంక బెట్టడానికి లేదు. అయితే ఆమెకి సరైన హిట్ లేక చాలా కాలమే అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాపై ఆమె గట్టిగానే ఆశలు పెట్టుకుంది. ఇక రాశీ ఖన్నా కెరియర్ గ్రాఫ్ చాలా స్లో అయిన తరువాత ఆమెకి దక్కిన గొప్ప అవకాశం ఇది. హరీశ్ శంకర్ కి కూడా ఈ సినిమా హిట్ చాలా కీలకం కానుంది. 'ఉస్తాద్' ఉ ప్పెనలా పాత రికార్డులు తుడిచేయడం ఖాయమనే అభిమానుల అంచనాలను ఈ సినిమా నిజం చేస్తుందేమో చూడాలి.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613